Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 26.01.2018, శుక్రవారం
సంపుటి : 37 సంచిక : 34
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# జనం.. జనం.. జగన్ జనం!

> జిల్లాలో మొదలైన పాదయాత్ర
> ఆరంభమే అదిరింది
> ప్రజా సంకల్పయాత్రకు పోటెత్తిన జనం

జనం... జనం... ఎటు చూసినా జనం... ఏ సందు చూసినా జనం... చెట్ల క్రింద... పుట్లపైన... పొలాల గట్ల మీద జనమే జనం... జాతరకి తరలి వచ్చారన్నట్లుగా జనం... మొలగొలుకులకు, రాజకీయ మొనగాళ్ళకు పేరెన్నికగన్న సింహపురిసీమలో, ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి వేదికైన నెల్లూరుజిల్లాలో వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తొలి అడుగే అదిరింది.

(మిగతా 12వ పేజీలో)




# వైకాపాకే విపిఆర్



## పెద్దల సభకు సిద్ధం

## పార్టీకి ఇది శుభ సంకేతం

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏ పార్టీలో చేరతాడు...? ఆ అదృష్టం ఆ శుభ యోగం ఏ పార్టీకి లభిస్తుంది..? ఇది ఈరోజు వరకు ఆయనను తెలిసిన వారందరూ వేసుకుంటున్న ప్రశ్న. ఆయనను దగ్గరగా గమనించే వారందరూ చేసుకుంటున్న చర్చ. విపిఆర్ అంటే జిల్లాలో సేవకు మారుపేరు. మంచి తనానికి పెట్టిన పేరు.

(మిగతా 12వ పేజీలో)






# కటకటాలకు వాకాటి

11లో

బ్యాంకులను ముంచిన కేసులో ఎమ్మెల్సీ నారాయణరెడ్డి అరెస్ట్

# గురుకులాలకు మంచి బియ్యం ఇవ్వండి

**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**

గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకోసం మంచి నాణ్యమైన బియ్యం అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. ఈనెల 22న నాయుడుపేట డివిజన్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ ఆర్డీఓ శీనానాయక్‌తో మాట్లాడుతూ, గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి విద్యార్థులకు మంచి ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఎన్టీఆర్ గృహకల్ప కింద పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకున్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు వెంటనే మంజూరుచేయాలన్నారు. అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద మ్యాచింగ్ నిధులతో ప్రజలకు నీటి సదుపాయాలను, రోడ్డు సౌకర్యాలను ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# వేతనాలు ఇప్పించి ఆదుకోండి

**- అధికారులకు కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల వినతి**

కోవూరు చక్కెర ఫ్యాక్టరీలో గత 30 ఏళ్ళుగా పనిచేస్తున్న తమకు నాలుగేళ్ళుగా వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వేతనాలు ఇప్పించి తమను ఆదుకోవాలని ఆ ఫ్యాక్టరీ సీజనల్ పర్మనెంట్ కార్మికులు జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు. తమకు వేతనాలివ్వాలని కోరుతూ వారు ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన చేసి, ఆ మేరకు అధికారులకు విజ్ఞాపనపత్రం సమర్పించుకున్నారు. ప్రస్తుతం 64 మంది సీజనల్ పర్మనెంట్ కార్మికులు పనిచేస్తున్నారని, తామందరికీ గత నాలుగేళ్ళ నుంచి వేతనాలు మంజూరు చేయకపోవడంతో తామెన్నో కష్టాలు పడుతున్నామని వారు పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఈ విషయం పరిశీలించి తమకు వేతనాలు మంజూరుచేయించాలని వారు కోరుతున్నారు.


# ప్రతినెలా గ్రామకమిటీల సమావేశాలు

**- కావలి రూరల్ టిడిపి సమావేశంలో తీర్మానం**

సింహపురి సమాచారం



రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతినెలా గ్రామ కమిటీలను సమావేశ పరచి, వారి సమస్యల విన్నపాలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కావలి రూరల్ మండల టిడిపి సమావేశంలో తీర్మానించారు. ఈనెల 20న రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు కోసూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్‌కార్డులు, పింఛన్‌లు మంజూరుచేసి, వారికి అన్నివిధాలా సహాయసహకారాలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరుతూ సమావేశం తీర్మానించింది. టిడిపి ఆదేశాల మేరకు 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాలను కావలి రూరల్‌మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో విజయవంతం చేసినందుకు నాయకులకు, కార్యకర్తలకు ఈ సమావేశంలో ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, మంత్రి నారా లోకేష్ తుమ్మలపెంట గ్రామంలో జరిపిన పర్యటనను విజయవంతం చేసినందుకు మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రూరల్‌మండలంలో వర్షాలు లేక వ్యవసాయానికి సాగునీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులుపడుతున్న సమయంలో సాగు నీరందించి, పంటలను రక్షించుకునేందుకు కృషిచేసిన బీద సోదరులకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఈ సమావేశంలో సెంట్రల్‌బ్యాంక్ డైరెక్టర్ దామిశెట్టి సుధీర్ నాయుడు, రూరల్ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వాయిల శ్రీనుబాబు, ప్రధానకార్యదర్శి ప్రళయకావేరి భాస్కర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నాగనగారి శ్రీనివాసులు, షేక్ ఖలీల్, ఉప్పాల శ్రీనివాసులు, సర్పంచ్‌లు మొర్ల వెంకట్రావు, కమతం బలరామ్, అరగల రాములు, చాగంటి వెంకటేశ్వర్లు, సూరే శ్రీనివాసులు రెడ్డి, జాలరావు, మందా మధు, రాంబాబు, పోసిన శ్రీనివాసులు, చెన్నారావు, బషీర్, కృష్ణయ్య, కె.సుబ్బారావు పాల్గొన్నారు.




**సూళ్ళూరుపేటలో**

# సిపిఐ జిల్లా మహాసభలు

భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) 24వ జిల్లా మహాసభలు మార్చి 4, 5, 6తేదీలలో నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలో జరుగుతాయని జిల్లా కార్యదర్శి ఎం.పార్థసారధి తెలిపారు. ఈ నెల 21న నెల్లూరు సంతపేటలోని సిపిఐ కార్యాలయంలో మహాసభల వివరాలను తెలియజేశారు. మార్చి 4న రెడ్‌షర్ట్ వాలంటీర్లతో కలిసి ప్రజాప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలకు జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మెన్ అరిగెల నాగేంద్ర సాయి, కార్యవర్గ సభ్యులు సి. హెచ్.ప్రభాకర్, యాటా శ్రీనివాసులు, నగర కార్యదర్శి మునీర్, పి.బాలకృష్ణ, వి.రామరాజు, కరిముల్లా, ఎన్.రమణయ్య, దామా వెంకయ్య, సత్యం, పి.సౌజన్య పాల్గొన్నారు.

**పెంచలకోనలో అన్నదానానికి**

# 2 లక్షల వితరణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్న దాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన వైద్యుడు సోంపల్లి పెంచల నాయుడు వితరణగా రెండు లక్షల రూపాయల చెక్‌ను అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# మాతృభాషను విస్మరించవద్దు

**- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

## ప్రొ. సిఎంకె రెడ్డి సారధ్యంలో ఘనంగా వీరపాండ్య కట్టబొమ్మన్, త్యాగరాజ జయంతి వేడుకలు

'ఎన్ని భాషలైనా నేర్చుకోండి కానీ, మాతృభాషను మాత్రం ఏనాటికీ విస్మరించవద్దని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం సెంటినరీ ఆడిటోరియం వేదికగా, అఖిలభారత తెలుగు ఫౌండేషన్ (ఏఐటిఎఫ్) అధ్యక్షులు ప్రొ. సిఎంకెరెడ్డి నేతృత్వంలో ఇటీవల 258వ వీరపాండ్య కట్టబొమ్మన్ జయంతి, 250వ త్యాగరాజ స్వామి జయంతి వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని మాట్లాడుతూ, వీరపాండ్య కట్టబొమ్మన్, త్యాగరాజస్వామి ఇద్దరూ ఎంతో మహనీయులని అన్నారు. ఒకరు దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుడని, మరొకరు సంగీత వాగ్గేయకారుడని అంటూ వారిరువురి సేవలను కొనియాడారు. వీరపాండ్య కట్టబొమ్మన్ అంటే తనకు చిన్ననాటి నుంచి ఎంతో అభిమానమన్నారు. అదే విధంగా శ్రీ త్యాగరాజస్వామి కృతులు అజరామరమని, అవి మానవాళి ఉన్నంత వరకు ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటాయని అన్నారు. ప్రపంచంలోని అన్ని సంస్కృతుల కంటే భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని అన్నారు. వేల సంవత్సరాలుగా మన సంస్కృతి సజీవంగా ఉందన్నారు. అందరూ ఐక్యమత్యంతో, దేశభక్తితో, సోదరభావంతో కలసిమెలసి జీవించాలన్నారు. మతాలు వేరైనా, భాషలు వేరైనా, మనమంతా భారతీయులమేనని, అందరం కలసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. ఇక్కడ తెలుగుభాషతో పాటు మైనార్టీ భాష చదువుకునేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి సూచించానన్నారు. దేశ నాయకుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో, సంగీత సాహిత్యాల్లో తీసుకు వచ్చి భావితరానికి, యువతకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్, డా॥ సి.యం.కె.రెడ్డి తదితరులు

## మాతృభాషకు ప్రోత్సాహం అందివ్వాలి - ప్రొ. సిఎంకె రెడ్డి

మాతృభాషను చదువుకునేందుకు విద్యార్థులందరికీ ప్రోత్సాహం ఇవ్వాలని ఈ సందర్భంగా అఖిలభారత తెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొ. సిఎంకె రెడ్డి కోరారు. స్కూల్ సిలబస్‌లో తెలుగు, మైనార్టీభాషలను తొలగించారని, అలా కాక ఆయా భాషలను చదువుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ, ఆ సమస్యను ప్రొ. సిఎంకె రెడ్డి ఉపరాష్ట్రపతి, గవర్నర్‌ల దృష్టికి తీసుకువచ్చారు. తమిళ పాఠశాలల్లో విద్యార్థులు తమ మాతృభాషను చదువుకునేవిధంగా తెలుగు, మైనార్టీభాషలను ప్రోత్సహిస్తూ ఆ పాఠశాలల్లో అవి తప్పనిసరి సబ్జెక్ట్‌గా ఉండేలా చేయాలని ఆయన కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఆయా భాషలు చదువుకుంటున్న విద్యార్థులకు ఉండే వసతులు ఇక్కడి విద్యార్థులకు కూడా అందేవిధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉపరాష్ట్రపతి, గవర్నర్ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర గవర్నర్ బన్వారిలాల్ పురోహిత్, రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి పి. బాలకృష్ణారెడ్డి, అపోలో ఆసుపత్రుల ఛైర్మెన్ డా.ప్రతాప్ సి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో గాయకుడు రాము సంగీత విభావరి అందరినీ అలరించింది. ప్రముఖ సినీకవి భువనచంద్ర రచించిన గీతం అందరినీ బాగా ఆకట్టుకుంది. అనంతరం, పలు రంగాల్లో విశిష్టసేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులకు ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఘన సత్కారం జరిగింది.

## ప్రొ. సిఎంకె రెడ్డి సేవలకు గుర్తింపుగా..

# పోస్టల్ స్టాంప్



ప్రొ. సిఎంకె రెడ్డి 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయన గౌరవార్ధం, గత 50ఏళ్ళుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలకు, పేదలకు నిర్వహిస్తున్న ఉచిత వైద్యసేవలకు గుర్తింపుగా భారతప్రభుత్వం పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడం ఎంతైనా విశేషం. ప్రొ.సిఎంకె రెడ్డి తమిళనాట తెలుగువారికి వెలుగులు పంచుతూ చేస్తున్న అనేక బృహత్తరమైన సామాజిక సేవలకు ఇది మంచి గుర్తింపు కావడం తెలుగువారందరికీ ఎంతో సంతోషకరం కూడా.

# తెలుగు సభలకి తరలిరండి

**- విపిఆర్, బలరామయ్యల పిలుపు**



ఫిబ్రవరి 3, 4వ తేదీలలో చెన్నైలోని కలైవానర్ అరంగంలో జరుగనున్న "ప్రపంచ తెలుగు సమాఖ్య" 11వ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలతో పాటు సంస్థ రజతోత్సవ సంబరాలలో తెలుగువారు అత్యధికంగా పాల్గొనాలని సంస్థ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడులు పిలుపునిచ్చారు. వీరిద్దరు సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు భాష ఉన్నతి కోసం సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఆశీర్వదించాలని, ఇప్పటివరకూ భారతదేశంతో పాటు పలు బయట దేశాలలో కూడా తెలుగువారి ప్రాభవాన్ని చాటడానికి సంస్థ కృషి చేసిందని, ఈసారి ద్వైవార్షిక సభతో పాటు సంస్థ రజతోత్సవం కూడా జరుపుకోవడం గమనార్హమని అన్నారు.

సంస్థ ఉపాధ్యక్షుడిగా మన నెల్లూరు నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నాయకత్వం వహిస్తుండడంతో నెల్లూరుజిల్లా నుండి అధిక సంఖ్యలో తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బలరామయ్యనాయుడు కోరారు. ఈ మహాసభలలో డెలిగేట్‌గా పాల్గొనదలచిన వారు రూ.750/-లు చెల్లించాలని, ఆసక్తి కలవారు తన ఫోన్ నెం.9441003505 నందు సంప్రదించవచ్చని ఆయన చెప్పారు.

## ఎయిర్‌పోర్టు తరహాలో...

# నెల్లూరు రైల్వేస్టేషన్



దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ 22వ తేదీన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్టు తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెల్లూరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి పరిచేందుకు రైల్వే బోర్డు 60కోట్లు కేటాయించింది. ఈ నిధులతో నాలుగు ఫ్లాట్‌ఫారాలకు గ్రానైట్ ఫ్లోరింగ్, పూర్తిస్థాయి షెల్టర్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలను కలుపుకుని 65వేల చదరపు అడుగుల స్థలంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో షాపింగ్‌మాల్‌ను కడతాం. ఇందులో హోటళ్ళు, మెడికల్ స్టోర్‌లు, కాఫీ షాప్‌లు వంటివన్నీ వుంటాయి. ఇందులో ప్రయాణీకులకు సౌకర్యంగా లిఫ్టులు, ఎస్కలేటర్లు వుంటాయి. వచ్చే నెలలో సికింద్రాబాద్ నుండి సాంకేతిక బృందం నెల్లూరొస్తుంది. వాళ్ళు ఈ స్టేషన్‌ను పరిశీలించి నివేదిక ఇచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్టు మాదిరిగా చూసేందుకు మూడు నుండి నాలుగేళ్ళ సమయం పట్టొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో అన్ని ఫ్లాట్‌ఫారాలను పరిశీలించారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఎలా పనిచేస్తున్నాయో చూశారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, డిఆర్‌ఎం ధనుంజయ, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, నెల్లూరు రైల్వేస్టేషన్ మేనేజర్ పి.ఆంథోని జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరివెన్నెలకి డా॥ నాగభైరవ అవార్డు



సుప్రసిద్ధ కవి స్వర్గీయ డా॥ నాగభైరవ కోటేశ్వరరావు 9వ అవార్డు 2017 సంవత్సరానికిగాను ప్రఖ్యాత సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి ఎంపికయ్యారని డా॥ నాగభైరవ అవార్డు కమిటి ప్రధానకార్యదర్శి చిన్ని నారాయణరావు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్లో జరిగే నాగభైరవ అవార్డు పండుగసభలో సిరివెన్నెలకు ప్రదానం చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ అవార్డు క్రింద రూ.25వేలు నగదు పారితోషికంతో పాటు ఘన సత్కారం జరుగుతుందన్నారు. అలాగే ప్రతియేటా ఇచ్చే నాగభైరవ స్ఫూర్తి అవార్డులకు వంజివాక సతీష్‌రెడ్డి(నెల్లూరు), డా॥ ఈదూరు సుధాకర్ (నెల్లూరు), కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్(మార్కాపురం), పి.లక్ష్మణరావు(విజయనగరం), కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు(ఏలూరు), శ్రీమతి ఆవాల శారద(విజయవాడ)లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. డా॥ నాగభైరవ అధ్యాపక సత్కారానికి ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత అధ్యాపకులు కాళిదాసు పురుషోత్తం ఎంపికైనట్లు తెలిపారు. 2009లో ప్రారంభించబడిన ఈ అవార్డులను ప్రముఖ సాహితీవేత్తలు మల్లెమాల సుందరరామిరెడ్డి, దర్భశయనం శ్రీనివాసాచార్య, రసరాజు, తనికెళ్ళ భరణి, అద్దేపల్లి రామ్మోహనరావు, సుద్దాల అశోక్‌తేజ, గొల్లపూడి మారుతీరావు, రావి రంగారావులకు ప్రదానం చేయడం జరిగిందన్నారు.

ఈ అవార్డు పండుగలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజధాని కమిటి సలహాసంఘ సభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీమంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, డా॥ నాగభైరవ అవార్డు కమిటి అధ్యక్షులు, ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి పాల్గొంటారని తెలిపారు. నాగభైరవ కుటుంబసభ్యులైన శ్రీమతి కూకట్ల రాజ్యలక్ష్మి, శ్రీమతి ధూళిపాళ్ళ రవీంద్రకుమారి, శ్రీమతి మన్నం మనోరమలు ఆత్మీయ ఆహ్వానితులుగా పాల్గొంటారని వెల్లడించారు. కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## 'ప్రభా'తం

# విశ్వవేదికపై భారత్ దార్శనికత

అందరి సహకారం ఉంటేనే ఎక్కడైనా సరే అభివృద్ధి పుష్కలంగా ఉంటుంది. కుటుంబంలోనైనా, సమాజంలోనైనా, చివరికి ప్రపంచంలోనైనా సరే..అందరికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. అవినీతి, అక్రమాలతో ఎవరికి వారు సొంత ఆర్జనకే జీవితాలను వ్యర్థం చేసుకోక, సమాజంలో శాంతి సామరస్యాలకి.. అందరి అభివృద్ధికీ అవసరమైన మార్గాలు వేయగలిగినప్పుడే ప్రగతి మన కళ్ళ ముందు కళకళలాడుతుంది. చుట్టూతా చుట్టుముడుతున్న అనేకానేక సవాళ్ళను ధీటుగా ఎదుర్కొంటూ, అందరి తోడ్పాటుతో అభివృద్ధి పథం వైపు నడిచినప్పుడే ప్రగతి ఫలాలు అందరికీ అందుతాయి. శాంతి సహనంతో..సుఖ సంతోషాలతో ప్రపంచం నడవాలంటే ఇరుకుదారుల్లో ఉన్న మనసును విశాలహృదయంగా మార్చుకోవాలి. అందుకు అన్ని దేశాలు కలసికట్టుగా ముందుకు సాగాలి. అప్పుడే విశ్వమంతా స్వేచ్ఛా స్వర్గంగా మారుతుంది. ఆరోజు రావాలి. ప్రపంచమంతా ఒక్కటై.. మనది వసుధైక కుటుంబం అని అందరూ గర్వంగా, సగర్వంగా చెప్పుకునే రోజు రావాలి. ఆ రోజును ఎల్లప్పుడూ కాంక్షించేది, విశ్వమానవాళి శాంతిని ఆకాంక్షించేది మన భారత్. అందుకే, ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్ళకు భారతీయ తత్వమే పరిష్కారం అని ప్రధాని మోదీ ప్రపంచస్థాయి వేదికపై స్పష్టం చేసి భారతీయ దార్శనికతను దశదిశలా చాటారు.




**ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్ళకు భారతీయ తత్వమే పరిష్కారమని ప్రధాని మోదీ స్పష్టం చేసి భారతీయ దార్శనికతను ప్రపంచానికి చాటారు. ప్రస్తుత ప్రపంచంలోని చీలికలు, విభేదాల పరిష్కారానికి భారతదేశ తత్వమైన 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనేది చక్కగా సరిపోతుందని, ఇదే ఉత్తమమన్నారు. దావోస్‌లో అంతర్జాతీయస్థాయిలో జరిగిన 'వరల్డ్ ఎకనమిక్ పోరం'లో భారత్ వాణిని ప్రధాని అత్యద్భుతంగా వినిపించి అందరి కరతాళధ్వనులందుకున్నారు.**

దావోస్‌లో జరుగుతున్న 'వరల్డ్ ఎకనమిక్ పోరం' వార్షిక సదస్సులో భారత్ వాణిని అద్భుతంగా, అమోఘంగా వినిపించి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. 'సబ్ కా సాథ్..సబ్ కా వికాస్' (అందరి సహకారంతోనే అద్భుత ప్రగతి) అంటూ.. ప్రస్తుత ప్రపంచానికి భారతీయ తత్వమైన 'వసుధైక కుటుంబం' ఉత్తమమన్నారు. ఇలా భారత్ దార్శనికతను ప్రపంచానికి చాటిచెప్పడంతో విశ్వవేదికపై భారతీయ ఔన్నత్య పతాకను మరోసారి రెపరెపలాడించినట్లయింది. ఈ సదస్సు సందర్భంగా కెనడా ప్రధాని జస్టిన్ ట్ర్యూడ్యూతో, నెదర్లాండ్స్ రాణి మాక్సిమాతోను, వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఛైర్మన్ క్లాస్ స్వ్యాబ్‌తోను, స్విస్ సమాఖ్య అధ్యక్షుడు అలేన్‌లతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు. అంతేకాదు, ఈ అంతర్జాతీయ వార్షిక సదస్సులో ప్రారంభప్లీనరీని ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దావోస్‌లో 18 దేశాలకు చెందిన 40 దిగ్గజ సంస్థల సారధులతో సమావేశం సందర్భంగా భారత ప్రధాని మోడీ ఎంతో దార్శనికతతో ప్రసంగించడం ప్రపంచదేశాలను బాగా ఆకట్టుకుంది. భిన్నత్వంలో ఏకత్వమే బలమని ప్రకటించడం, అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో సంపదను సృష్టించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు భారత్‌కు తరలిరావాలని ఆహ్వానించడం అందరినీ బాగా ఆకట్టుకుంది. అపారమైన మానవ వనరులను వినియోగించుకుని, నైపుణ్యాన్ని జోడించి, అవరోధాలను అధిగమించి అద్భుతమైన అవకాశాలను మనకు మనమే సృష్టించుకోవాలని ప్రధాని మోదీ అందరికీ అభివృద్ధి మంత్రం ఉద్బోధించారు.

శతాబ్దాల తరబడిగా ఘనమైన సంస్కృతీ సంప్రదాయాలకు, శాంతి సుహృద్భావాలకు నెలవైన భారతావని ఆర్థిక వాణిజ్యవిధానాల పరంగా రూపాంతరం చెందుతున్న దశలో, ఇలా బయటినుంచి కూడా పెట్టుబడుల్ని స్వాగతించడం అందరికీ సంతోషాన్ని కలిగించేదే. సంపదతో కూడిన శ్రేయస్సు కావాలంటే భారత్‌కు రండి, ఆరోగ్యంతో కూడిన పూర్ణత్వం కావాలంటే భారత్‌కు రండి!, సౌభాగ్యంతో కూడిన శాంతి కావాలంటే భారత్‌కు రండి!.. సహకారమే కానీ విభజనలు, చీలికలు లేని స్వేచ్ఛాపూరిత స్వర్గాన్ని సృష్టిద్దాం రండి!..అంటూ ప్రధాని మోడీ భారత్‌లో పెట్టుబడులకు ఆహ్వానించిన తీరు అమోఘం. భారతీయ తాత్విక చింతనను, దార్శనికతలను ఎంతో వివరంగా పేర్కొంటూ ఈ ప్రపంచస్థాయి సదస్సులో భారత్ ప్రత్యేకతను చాటారు. ప్రపంచం ఎదుర్కొంటున్న మూడు పెనుసవాళ్ళను ఈ సందర్భంగా ప్రధాని మోడీ అందరి దృష్టికి తీసుకువచ్చారు. పర్యావరణ సమతూకాన్ని పాటించకుంటే మానవాళి మనుగడకు పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. తీవ్రమైన వాతావరణ మార్పులతో మంచుఖండాలు కరిగిపోతున్నాయని, ప్రతికూల వాతావరణం వల్ల కొన్ని ద్వీపాలు మునిగిపోతున్నాయన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనేందుకు ఏంచేయాలో ప్రపంచం ఆలోచించాలన్నారు. వాతావరణ మార్పులపై సంపన్నదేశాల ద్వంద్వ విధానానికి చురకలంటిస్తూనే, ఈ విషయంలో అగ్రరాజ్యాలు చిన్నదేశాలకు వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునివ్వడం ద్వారా ఆయా దేశాలకు కర్తవ్యబోధ చేసినట్లయింది. రక్షణాత్మక వాణిజ్య ధోరణులు మంచిది కాదన్నారు. ఉగ్రవాదుల్లో మంచి ఉగ్రవాదులు- చెడు ఉగ్రవాదులు అంటూ ఉండరని అంటూ ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు తప్పనిసరి అని, ఉగ్రవాదంపై పోరాడేవారికి భారత్ బాసటగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ పురోగతికి, వేగవంతమైన అభివృద్ధికి అన్ని దేశాలు సహకరించాలన్నారు. ప్రపంచానికి వాటిల్లుతున్న ముప్పులను ఎదుర్కొనేందుకు కాలయాపన చేయకుండా అన్ని దేశాలకూ తక్షణ స్పందన అవసరమన్నారు. మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం అవరోధాలన్నిటినీ అధిగమించాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యమనేది ఒక వ్యవస్థ కాదని.. అది భారతీయ జీవన విధానమని స్పష్టం చేశారు. ప్రజలను ఏకం చేయాలే కానీ, విభజించడం కాదనీ, ప్రపంచమంతా ఒక్కటే అనే భారతీయ తత్వం..'వసుధైక కుటుంబ విధానం' ఉత్తమమని సగర్వంగా ప్రకటించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అంతేకాదు, ప్రపంచ శాంతికి భారత్ ఎప్పుడూ పాటుపడుతూనే ఉంటుందని, ఐరాస శాంతి పరిరక్షక దళంలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించే సైనికులే ఎక్కువగా ఉన్నారని ఉదహరించారు. ప్రపంచ ఆర్థిక పురోగతికి భారత్ ఎల్లవేళలా సహకరిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. విశ్వవేదికపై భారత్ వాణిని అత్యద్భుతంగా వినిపించి, భారత్ దార్శనికతను ప్రపంచానికి చాటడంలో ప్రధాని మోడీ తనకు తానే సాటి అన్పించుకున్నారు.

# మాకాని వెంకట్రావు సమారాధన

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ప్రియశిష్యులు మాకాని వెంకట్రావు స్వామి సమారాధన ఈ నెల 20న నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధి గురునిలయంలో నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన మాకాని స్వర్గస్థులైనారు. అప్పటినుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. గురునిలయం ప్రాంగణంలో వెలసివున్న శ్రీ వెంకయ్యస్వామికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించి, భజనలు నిర్వహించారు. మాకాని వెంకట్రావు కుమారులు బుజ్జి, చంద్ర, గోపి సంప్రదాయ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నారాయణస్వామి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఆశ్రమాల పీఠాధిపతులు, గుంటూరు, విజయనగరం, అమరావతి, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాకాని చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆశ్రమ శిష్యబృందం బాలాజీ, మురళీ, శ్రీధర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన భక్తులు మాట్లాడుతూ త్వరలో ఆశ్రమ పరిధిలో మాకాని వెంకట్రావుస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



# లాయర్ నేత్రదానం

నెల్లూరు నగరానికి చెందిన లాయర్ కోలపల్లి ఉమా మహేశ్వరరావు ఈ నెల 21వ తేదీ రాత్రి పరమపదించారు. కుటుంబసభ్యుల కోరికమేరకు మాదరన్ ఐ ఆసుపత్రి సిబ్బంది వెంకటేష్ రాత్రి 12గంటలకు ఆయన నేత్రాలను సేకరించారు. పదేళ్ళ క్రితం లాయర్ ఉమామహేశ్వరరావు తల్లి లక్ష్మీకాంతమ్మ నేత్రదానం చేసారు. నిండు మనస్సుతో నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులకు నేత్రదాన మోటివేటర్ వై.వి.సుబ్బారావు ధన్యవాదాలు తెలిపారు.

# సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు

ఈ నెల 22న శ్రీపంచమి సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో కొలువై వున్న సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి వేడుకగా పూలంగిసేవ చేశారు. కొంతమంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, దర్మకర్తల మండలి సభ్యులు ఈ వేడుకను పర్యవేక్షించారు.

# అప్పడేమైంది ఈ బుద్ధి?

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటిని అమలు చేయకపోతే సుప్రీం కోర్టుకు పోతానంటున్నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్రం ప్రకటించిన రోజున చంద్రబాబుకు ఈ బుద్ధి ఏమైంది? కేంద్రంతో ఆరోజే చంద్రబాబు పోరాడివుంటే ఫలితం వేరుగా వుండేది కదా! ఓటు-నోటు కేసు కోసం ఆయన రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టాడు. ప్రత్యేకహోదాను వదిలేసి ప్రత్యేకప్యాకేజీని ఒప్పుకున్నాడు. రాష్ట్రానికి రావాల్సిన వాటిని గట్టిగా అడగలేకపోయాడు. చంద్రబాబు ఇంతకుముందే కేంద్రంతో రాష్ట్ర ప్రయోజనాల గురించి పోరాడివుంటే బాగుండేది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఇప్పుడు సుప్రీం కోర్టుకు పోయి ఏం లాభం?


**చల్లా బాలనాగిరెడ్డి, నెల్లూరు.**

## ప్లాస్టిక్‌పై చైతన్యం రావాలి

సమాజంలో ప్లాస్టిక్ కవర్‌ల వినియోగం పెరిగింది. ప్రతి అవసరానికీ క్యారీ బ్యాగులను వాడుతున్నారు. కర్రీస్ పాయింట్లలో పొగలు కక్కే కూరలను ఈ ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ చేసిస్తుంటారు. ఆ వేడికి ప్లాస్టిక్ కరిగి కూరలో కలుస్తుంది. తిన్నాక ఇది మన ఒంట్లో కలుస్తుంది. వేడివేడి టిఫిన్‌ను కూడా క్యారీ బ్యాగులో పార్సిల్ చేసిస్తున్నారు. ప్లాస్టిక్ బాక్స్, ప్లాస్టిక్ స్పూన్‌లతో ఆహారం తీసుకుంటున్నాం. జనాలకు రోగాలు రాక ఇంకేం వస్తాయి. ప్లాస్టిక్ సంచుల వాడకంపై ప్రజల్లో చైతన్యం రావాలి. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి అందరూ దూరంగా వుండాలి. ప్రభుత్వం ఆ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేయాలి.

**- టి.సుహాసిని, నెల్లూరు.**

## ఆధార్‌పై ఆందోళన




కేంద్ర ప్రభుత్వమేమో అన్ని పథకాలకు, అన్ని లావాదేవీలకు ఆధార్‌ను అనుసంధానం చేయాలంటుంది. ఇలా చేస్తే వ్యక్తుల యొక్క వ్యక్తిగత వివరాలు ఇతరుల చేతుల్లోకి పోతాయనే భయం నెలకొంది. సైబర్ నేరాలు పెరిగిపోయాయి. ఒకరి సైట్‌లోకి ఇంకొకరు దూరడం, సమాచారాన్ని తస్కరించడం సులభమైపోయింది. కాబట్టి 'ఆధార్' వివరాలపై పటిష్ట భద్రత కల్పించగలమనుకున్నాకే అనుసంధానం మొదలుపెట్టాలి.

**పూతల నాగప్రసన్న, తిరుపతి.**

## కోళ్ళపై ఎందుకంత ప్రేమో!

హైకోర్టు న్యాయమూర్తులకు ఆవులపై లేని ప్రేమ కోళ్ళపై కనిపిస్తోంది. బక్రీద్ పేరుతో లక్షల ఆవులను వధిస్తుంటే న్యాయమూర్తులెప్పుడూ నోర్లు తెరవలేదు. సంక్రాంతి కోడి పందేలపై మాత్రం తెగ సీరియస్ అవుతున్నారు. సంక్రాంతి పండుగ సంబరాలలో కోడిపందేలు ఓ భాగం, ఇది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం, మొదట న్యాయమూర్తులు గోవధను ఆపి ఆ తర్వాత కోళ్ళ పందేల గురించి సీరియస్ అయితే బాగుంటుంది.

**- పి.రామిరెడ్డి, నెల్లూరు.**

## అజ్ఞానవాసి

పవన్‌కల్యాణ్ అజ్ఞాతవాసి కాదు అజ్ఞానవాసి అనుకోవచ్చు. రాజకీయాలకు దూరంగా వుండి సినిమాలు చేసుకుంటుంటే రాష్ట్రంలో తన ఇమేజ్‌ను కాపాడుకోగలడు. అన్ని పార్టీలలోనూ అతని అభిమానులున్నారు. తెలుగుదేశంకు మేలు చేయాలని చెప్పి రాజకీయాలు చేస్తే మాత్రం చరిత్రహీనుడవుతాడు. భవిష్యత్‌లో ఎందుకూ పనికిరాకుండాపోతాడు.

**కె.పీటర్ రమేష్, నెల్లూరు.**

### "విపిఆర్ వైద్యం"... ఉచిత వైద్య శిబిరం

# పేద గుండెకు విపిఆర్ అండ

## 250 మందికి పైగా ఉచిత వైద్యసేవలు

**- ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**

**ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేపడుతున్న సామాజిక సేవలు ఎందరో నిరుపేదలు, ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేస్తున్నాయి.**

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొంతకాలం క్రితం చేపట్టిన విపిఆర్ 'అమృతధార' కార్యక్రమం అనేక గ్రామల్లో ప్రజల దాహార్తిని తీరుస్తూ అందరి శుభ దీవెనలు అందుకుంటోంది. ముఖ్యంగా ఫ్లోరైడ్, టిడిఎస్ వంటి నీటి సమస్యలతో ఇబ్బందిపడుతున్న గ్రామీణ ప్రజలకు, ఇతర అసమానతలతో బాధలు పడుతున్న గ్రామాల ప్రజలకు శుద్ధిచేసిన నీటిని (మినరల్ వాటర్‌ప్లాంట్)లను ఏర్పాటు చేస్తుండడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తుండడం అందరికీ తెలిసిందే. ఈ కార్యక్రమం ఆయా గ్రామాల ప్రజల సహకారంతో దిగ్విజయంగా కొనసాగుతుండగా, ఇప్పుడు మరోవైపు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'విపిఆర్ వైద్యం' కూడా ఎందరో నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది. 'విపిఆర్ అమృతధార'తో ప్రజల దాహార్తి తీరుతుంటే, 'విపిఆర్ వైద్యం' గుండె వ్యాధులతో అల్లాడుతున్న నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21న నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, చెన్నై అపోలో, కిమ్స్, సింహపురి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు గుండెజబ్బుల నివారణకు సంబంధించి మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన చెన్నై అపోలో, కిమ్స్, సింహపురి ఆసుపత్రులకు చెందిన గుండెవ్యాధుల శస్త్రచికిత్సల నిపుణులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, విపిఆర్ వైద్యం ద్వారా పేదలకు ఉచిత వైద్యంతో పాటు ఉచిత మందులు, అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని, అదేవిధంగా ప్రతినెలా ఉచిత వైద్యశిబిరాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. చెన్నై అపోలో ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె వ్యాధుల శస్త్రచికిత్సల నిపుణులు పద్మశ్రీ డాక్టర్ ఇ.సత్యమూర్తి, కిమ్స్ ఆసుపత్రి నుంచి డాక్టర్ శ్రీనివాసరాజు, సింహపురి హాస్పిటల్స్ నుంచి డాక్టర్ భక్తవత్సలరెడ్డితో పాటు, ప్రముఖ గుండెవ్యాధుల నిపుణులు డాక్టర్ ఏంజిలో హిన్రిజాకబ్, డాక్టర్ రాకేష్ శంకరన్, డాక్టర్ పాల్ వేదానంద్, డాక్టర్ సుజాత తదితరులు విచ్చేసి నిరుపేదల గుండెవ్యాధుల నివారణకు తగు సూచనలు చేసి, వారికి పరీక్షలు నిర్వహించి పేదలకు సేవలు చేయడం ఎంతో అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు. వారందరికీ విపిఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో 250 మందికి పైగా నిరుపేదలు గుండెకు సంబంధించిన వైద్యం చేయించుకోవడం విశేషం. ఈ సందర్భంగా, కల్లూరుపల్లికి చెందిన నాగరాజు–హేమల కుమార్తె ఈక్షిత గుండెకు చిల్లు పడినట్లు వైద్యులు గుర్తించి, ఆ పాపకు చెన్నై నుంచి వచ్చిన డాక్టర్ ఇ.సత్యమూర్తి చెన్నై అపోలో ఆసుపత్రివారిని సంప్రదించి వెంటనే ఆ పాపకు అయ్యే ఆపరేషన్ ఖర్చు మొత్తాన్ని అపోలో ఆసుపత్రి భరిస్తుందని తెలిపారు. వైద్యపరీక్షల అనంతరం, ఈ వైద్యశిబిరానికి విచ్చేసిన ప్రముఖ గుండె వ్యాధుల నిపుణులను వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి–ప్రశాంతిరెడ్డి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రశాంతిరెడ్డి, సింహపురి హాస్పిటల్స్ ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.నారాయణరెడ్డి, విపిఆర్ హాస్పిటల్స్ డాక్టర్ సత్యనాథ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, విపిఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ కో–ఆర్డినేటర్ శంకర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యసేవలను ప్రారంభిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



వైద్య సేవలను పరిశీలిస్తూ...

# అమోఘం... నీ వేణుగానం

- **సాయిహేమంత్‌ని ప్రశంసించిన ప్రధాని**
- **డిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నివాసంలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరం**

'మీ నాశికా వేణుగానం అమోఘం.. అద్భుతం'..అంటూ నెల్లూరుకు చెందిన ప్రముఖ నాశికా వేణుగాన కళాకారుడు సాయిహేమంత్‌ను మన ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసలతో ముంచెత్తాడు. 'అనునిత్యం యోగా చేసే వ్యక్తిగా, ముక్కుతో వేణుగానం చేయడం ఎంతకష్టమో నాకు తెలుసు. ఇది అనితరసాధ్యమైన ప్రక్రియ'.. అంటూ ప్రధాని తన మాటల్లో అన్నారు. సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సాక్షిగా ఆ కళాకారునికి ప్రధాని తన ప్రశంసలు అందజేశారు. ఇది నెల్లూరు కుర్రోడికి లభించిన అరుదైన గౌరవం. ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి నివాసంలో జనవరి 21న జరిగిన సంక్రాంతి మిలన్(సంబరం)లో భారత ప్రధాని నరేంద్రమోడీతో పాటు, భారతీయ జనతాపార్టీ అగ్రనేత అద్వానీతో పాటు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, రాజ్యసభ ఉపాధ్యక్షుడు పిజె కురియన్, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, నిర్మలాసీతారామన్, అశోక్ గజపతిరాజు, స్మృతి ఇరానీ, విజయ్‌గోయల్, జయంత్‌సిన్హా, ఆర్‌కె సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎల్. నాగేశ్వరరావు, అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్, కేబినెట్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌సిన్హా, హోం శాఖ కార్యదర్శి రాజీవ్‌గాబా, కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, వెంకయ్యనాయుడి కుటుంబసభ్యులందరితో పాటు, రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు, అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఇది, వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి అయ్యాక నిర్వహించిన తొలి సంక్రాంతి సంబరం కావడం విశేషం. అందుకే ఈ సంక్రాంతి సంబరం అంబరాన్నంటేవిధంగా సాగింది. దేశరాజధానిలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, తెలుగువెలుగులను చిందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంది. ఎంతో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, వెంకయ్యనాయుడు ఎన్నో ఏళ్ళ నుంచి ఢిల్లీలో సంక్రాంతి సంబరాలు కొనసాగించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇందువల్ల దక్షిణ భారతీయులందరినీ ఒకేచోట కలవడానికి వీలవుతోందన్నారు. ఈ సందర్భంగా కొందరు కళాకారులు భారతీయ సంప్రదాయ నృత్యంతో యోగాను జోడించి ప్రదర్శించడాన్ని ప్రధాని కొనియాడారు. అనంతరం, కళాకారులను వేదికపైకి పిలిచి అభినందించారు. ఈ వేడుకలో భాగంగా, అత్యద్భుతంగా నాశికా వేణుగానం చేసి అందరినీ అలరించిన నెల్లూరుకు చెందిన కళాకారుడు సాయి హేమంత్‌ను ప్రధానితో పాటు అనేకమంది ప్రముఖులు ప్రశంసించారు. అదేవిధంగా ఆ బృందం సభ్యులను కూడా అభినందించారు. తొలుత, సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అందరినీ ఆప్యాయంగా పలుకరించి, అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలకు వెంకయ్యనాయుడు కుమార్తె దీపమ్మ సారథ్యం వహించారు.






సాయి హేమంత్‌ను సత్కరిస్తున్న అద్వానీ

# గుంతలు పూడ్చకుంటే ఉద్యమమే!

**- కోటంరెడ్డి హెచ్చరిక**



నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ పేరుతో తవ్విన గుంటలను మార్చి 31వ తేదీలోపు పూడ్చకపోతే పబ్లిక్ హెల్త్ కార్యాలయం ముందు ప్రజలతో కలిసి నిరవధిక ధర్నాకు దిగుతానని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 20వ తేదీన రూరల్ నియోజకవర్గ పరిధిలోని హౌసింగ్ బోర్డు, న్యూ మిలిటరీ కాలనీలలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్ లైన్ పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు తవ్విన గుంతలతో తాము పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకి చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి స్పందిస్తూ... ఈ విషయమై గతంలోనే పబ్లిక్ హెల్త్ ఎస్.ఇని కలిసి మాట్లాడానని, ఆయన 2018 మార్చి 31లోపు తవ్విన రోడ్లన్నింటిని బాగు చేస్తామని హామీ ఇచ్చి వున్నారని, ఆ గడువు ఇంకెంతో దూరంలో లేదని, ఆ గడువు లోపు రోడ్లను బాగు చేయకపోతే ఆందో ళన తప్పదని హెచ్చరించారు.



# నెల్లూరు కబుర్లు

## నెల్లూరుజిల్లాకు మూడోర్యాంకు

ఆర్థికపరమైన ఫిర్యాదులు, ప్రజా విజ్ఞప్తుల పరిష్కారంలో నెల్లూరుజిల్లా మూడోస్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో కృష్ణా, ద్వితీయ స్థానంలో కర్నూలు జిల్లాలు నిలిచాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ఈ ర్యాంకులు ప్రకటించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల కార్యాలయాల్లో గ్రీవెన్స్‌డే ఏర్పాటుతో పాటు మీ సేవ 1100 డయల్ వంటి ప్రజావిజ్ఞప్తుల వేదికల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా అధికార యంత్రాంగం బాగానే కష్టపడుతోంది. వారి కష్టానికి ఫలితమే మూడో ర్యాంకు.

## రథోత్సవాలు ఇబ్బందే!

నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులని చెప్పి ప్రతి సిమెంట్ రోడ్డును మధ్యలో కట్ చేసి పైపులేసి మళ్లీ మట్టితో కప్పెట్టారు. మొన్న వర్షాలకు చాలా వాహనాలు ఈ తవ్విన గుంతల్లో పడ్డాయి. వాహనదారులు అనేక అగచాట్లు పడ్డారు. సామాన్యుల పరిస్థితి ఇలా వుంది. వచ్చే నెలాఖరు నుండి తిరునాళ్ళు మొదలవుతాయి. రంగనాథస్వామి రథోత్సవం, వేణుగోపాలస్వామి రథోత్సవం, ఉస్మాన్ సాహెబ్‌పేట కోదండరామస్వామి రథోత్సవం, నవాబుపేట మల్లేశ్వరస్వామి రథోత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి. వేలసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. తవ్విన సిమెంట్ రోడ్ల మీద రథాలపై దేవుళ్ళు ఎలా వూరేగుతారో చూడాలి!

## గిరిజన సంక్షేమ అధికారిగా విద్యావాణి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిగా బి.విద్యారాణిని నియమించారు. విజయనగరం జిల్లాలో ఏటిడబ్ల్యూఓగా పని చేస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించి నెల్లూరుకు బదిలీ చేశారు.



## జగన్ యాత్రలో జనజాతర

వెంకటగిరిలో పోలేరమ్మ జాతర జరుగుతుంటే... తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర జరుగుతుంటే... నర్రవాడలో వెంగమాంబ తిరునాళ్ళు జరుగుతుంటే... జిల్లాలోని అన్ని మండలాల ప్రజలు ఎలా తరలి వెళతారో... వైకాపా అధినేత జగన్ పాదయాత్ర కోసం అభిమానులు అలా వెళుతున్నారు. 23వ తేదీన జగన్ పాదయాత్ర జిల్లాలోకి ప్రవేశించడం తెలిసిందే! జగన్ పాదయాత్రలో కొన్ని ప్రాంతాలు కవర్ కావని తెలుసుకున్న ఆ ప్రాంతాల ప్రజలు, వై.యస్. అభిమానులు జగన్‌ను చూడడానికి వాహనాలేసుకుని భారీగా తరలి వెళ్తున్నారు. జిల్లాలో జగన్ ఎక్కడ పర్యటిస్తుంటే అక్కడకు పొద్దున్నే వెళ్ళిపోతున్నారు.

## మాగుంట లే అవుట్‌లో పోర్టు స్వచ్ఛభారత్




కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో 22వ తేదీ నెల్లూరు మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 150మంది పోర్టు సిబ్బంది చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చారు. చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. కృష్ణపట్నం పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్ పచ్చజెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోర్టు సిబ్బంది జి.సాంబశివరావు, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, ఆర్.శివ, దేముడు శివకుమార్, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టండి

### - ట్రాన్స్‌కో ఎస్.ఇ.ని కోరిన నుడా ఛైర్మెన్



నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు రోడ్డులోని జగదీష్ నగర్ రిజర్వ్ స్థలంలో ఏర్పాటు చేస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విద్యుత్‌శాఖ ఎస్.ఇ విజయకుమార్‌రెడ్డిని కోరారు. 22వ తేదీ ఆయన విద్యుత్‌భవన్‌లో ఎస్.ఇని కలిసి దీనిపై మాట్లాడారు. ఇక్కడ సబ్‌స్టేషన్ రావడం వల్ల ఎవరికీ ఇబ్బంది లేదు. 10వేల కుటుంబాలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతాయి. ఎండాకాలంలో విద్యుత్ సమస్యలు ఎక్కువగా వుంటాయి. ఓవర్‌లోడ్ సమస్యతో తరచూ కరెంట్ పోవడం జరుగుతుంది. కాబట్టి తగినన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అవాంతరాలు లేకుండా చేయాలని కోరారు. ఎవరో అవాంతరాలు సృష్టిస్తున్నారని చెప్పి ఇక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణం ఆపాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ నాయకులు అంచూరు శ్రీనివాసులు, మస్తాన్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

## కవి సురేంద్రకు సత్కారం

విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21వ తేదీన సాంస్కృతీ సమాఖ్య 46వ వసంతాల వార్షిక సాహిత్య మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి డా॥ అద్దేపల్లి రామమోహన్‌రావు భాషా విశిష్టత - ఆధునికత - ప్రజలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నెల్లూరీయుడు తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు ప్రసంగించి అతిథుల మన్ననలు అందుకున్నాడు. అనంతరం సాంస్కృతీ సమాఖ్య ప్రధానకార్యదర్శి వి.శిరీష్‌కుమార్, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ప్రధానకార్యదర్శి గోళ్ళ నారాయణరావు, అద్దేపల్లి ప్రభు, అరసవిల్లి కృష్ణ, సాధనాల వెంకటరమణ, డా॥ కడియాల రామమోహనరాయ్, చలపాక ప్రకాష్, తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ చేతులమీదుగా శాలువా, జ్ఞాపికతో ఘన సత్కారం అందుకున్నారు.



సత్కారాన్నందుకుంటున్న గుండాల నరేంద్రబాబు

## ప్రజా సంకల్పయాత్ర విజయవంతం కావాలి

### కొరపాటి మురళీనాయుడు పూజలు



ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంకల్పయాత్ర జిల్లాలో విజయవంతం కావాలని వైఎస్సార్సీపి జిల్లా రైతువిభాగం కార్యదర్శి కొరపాటి మురళీనాయుడు ఆధ్వర్యంలో ఈనెల 22న పూజలు నిర్వహించారు. దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వైస్సార్సీపి ఘన విజయం సాధించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ పూజల్లో వైస్సార్సీపి కార్యకర్తలు రాజు, శివ, అరుణ్, కోటి, లక్ష్మయ్య, వెంకీ, నానీ, చిన్నా, గోవిందు, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మిత్రబల(గ)ం తోడుగా బలరామయ్య ప్రమాణస్వీకారం




ప్రమాణస్వీకారం చేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు ఏసి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఈ నెల 21న నెల్లూరు వేదాయపాలెంలోని వందన గ్రాండ్ హోటల్‌లో జరిగింది. నెల్లూరులో కోడిగుడ్ల బలరామయ్యగా పేరుగాంచిన నెక్ సభ్యులు నలుబోలు బలరామయ్య నాయుడు అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తుండడంతో ఆయన ఆప్తులు, ఆత్మీయులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఏరియా-2 అంతర్జాతీయ వాకర్స్ సంస్థ సమన్వయకర్త ఎం.వి.సుబ్బారెడ్డి సభ్యుల చేత ప్రమాణం చేయించారు. అధ్యక్షులుగా నలుబోలు బలరామయ్య నాయుడు, ఉపాధ్యక్షులుగా జి.వి.కృష్ణయ్య, సాయిసుబ్బారావు, దొడ్ల జయరామనాయుడు, కార్యదర్శిగా వినుకొండ వెంకటేశ్వర్లు, సంయుక్తకార్యదర్శులుగా యు.గోవర్ధన్, లక్కాకుల శ్రీనివాసులు, బి.సూర్యనారాయణ, కోశాధికారిగా కొండూరు సుబ్బారావు, జాలీవాకర్‌గా ఐ.సోను, కార్యనిర్వాహక సభ్యులుగా డా॥ కోసూరు సూర్యనారాయణ, పి.కృష్ణారెడ్డి, ఎల్.సుబ్బరామిరెడ్డి, కె.నారాయణ నాయక్, ఎలసునూరు పిచ్చయ్య, అంబూరు శేషయ్య, పిట్ల రాజారావు, పిగిలం రంగయ్య, మాగంటి ప్రసాద్, టి.ఎల్.శరత్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు. 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, వాకర్స్ మాజీగవర్నర్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, డిప్యూటీ గవర్నర్లు పి.పట్టాభి రామిరెడ్డి, ఎస్.వి.సురేష్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. పి.ఆంజనేయులు ఈ కార్య క్రమాన్ని నిర్వహించారు. వచ్చిన అతిథులందరికీ దోశ, చికెన్‌తో బలరామయ్య ఆత్మీయ అల్పాహార విందునిచ్చారు.

## బాగుపడ్డ బలిజపాలెం రోడ్డు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో బలిజపాలెం వుంటుంది. పేరుకు ఇది కార్పొరేషన్ పరిధిలో వున్నా చూడడానికి ఏదో ఓ మారుమూల గ్రామంలో వున్నట్లుంటుంది. చింతారెడ్డిపాలెం రోడ్డు నుండి ఈ ఊరిలోకి దాదాపు కిలో మీటరు రోడ్డు వుంటుంది. ఆ రోడ్డును బాగు చేయడానికి పాలకులకు ఇన్నేళ్ళు పట్టింది. ప్రస్తుతం ఆ రోడ్డును తారురోడ్డుగా వేసి రాకపోకలకు అనువుగా మార్చారు. ఇప్పటి దాకా ఈ రోడ్డు రాళ్ళు తేలిపోయి గుంటలమయమై రాకపోకలకు చాలా ఇబ్బందిగా వుండేది. దాదాపు ఏడేళ్లుగా ఈ రోడ్డు అధ్వాన్నంగానే వున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఎట్టకేలకు దీనికి మోక్షం కలిగింది. ఈ దారిలో నారాయణ హాస్పిటల్, ధనలక్ష్మీపురం వైపు వెళ్ళే వాళ్ళకు కూడా ఇది దగ్గరి దారవుతుంది.

## ఇన్‌ఛార్జ్ మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన అమరేంద్రనాథ్‌రెడ్డి



మేయర్‌తో డా॥ అమరేంద్రనాథ్

నెల్లూరు కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ ఆరోగ్యాధికారిగా డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి 22వ తేదీన బాధ్యతలు తీసుకున్నారు. టిపి గూడూరు మండలం వరిగొండ పిహెచ్‌సి డాక్టర్‌గా, కృష్ణపట్నం పోర్టు డాక్టర్‌గా సేవలందిస్తున్న ఆయనను నెల్లూరు కార్పొరేషన్‌కు ఇన్‌ఛార్జ్ హెల్త్ ఆఫీసర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మేయర్ అబ్దుల్ అజీజ్‌ను, కమిషనర్ ఆలీం బాషాలను మర్యాదపూర్వకంగా కలిసి పారిశుద్ధ్యం సమస్యలపై చర్చించారు.

## ఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మాబూ




ఆర్టీసీలో కీలకమైన యూనియన్ అయిన ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన షేక్ మహబూబ్ ఎన్నికయ్యారు. నెల్లూరు ఆర్టీసీలో అందరికీ మాబూగా సుపరిచితుడైన మహబూబ్ ఇంతకుముందు పదిహేనేళ్ళ పాటు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఈయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నికైన మహబూబ్‌ను సహచర సిబ్బంది, కార్మికులు అభినందించారు.

## విజృంభిస్తున్న జ్వరాలు

చలికాలం ప్రభావంతో సీజనల్ వ్యాధులు బుసకొడుతున్నాయి. నెల్లూరులో వైరల్ ఫీవర్స్ ఎక్కువుగా వుంటున్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ముఖ్యంగా ముదురు దోమలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. తరచూ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగుతుండడంతో నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారుతోంది. క్రమం తప్పకుండా చెత్తను ఎత్తరు, మురికి కాలువల్లో సిల్టు తొలగించడం చేయడం లేదు. కాలువల్లో నెలల తరబడి మురుగు నిలిచి దోమలు బలిసిపోతున్నాయి. వీటి కాటుకు జనం బెంబేలెత్తుతున్నారు. నగరంలో పందులూ స్వైర విహారం చేస్తున్నాయి. వీటన్నింటి మూలంగా యధాఫలంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# సుబ్బరామిరెడ్డి కళాసేవ నిరుపమానం

- కాకతీయ కళావైభవం మహోత్సవంలో వక్తల ప్రశంస
- హీరో మోహన్‌బాబుకు 'విశ్వనట సార్వభౌమ' బిరుదు ప్రదానం

ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యుడు, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి చేస్తున్న కళాసేవ నిరుపమానమని, గత నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖ సినీకళాకారులను, సినీతారలను, కవులను, పండితులను ఆహ్వానించి, వారిని ఘనంగా సత్కరిస్తూ కళారంగానికి ఎంతో ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని అందజేస్తున్నారని పలువురు వక్తలు ప్రశంసించారు. ఈనెల 17వ తేది రాత్రి హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికపై టిఎస్సార్ కాకతీయ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకతీయ కళావైభవ మహోత్సవం జరిగింది. ఆద్యంతం అత్యంత అద్భుతంగా.. అద్వితీయంగా జరిగిన ఈ వేడుకలో ఎంతో మంది ప్రముఖ సినీ కళాకారులు, ప్రముఖులు, రాజకీయనాయకులు పాల్గొన్నారు. ఎంతోమంది సినీ ప్రముఖుల రాకతో కనువిందుగా జరిగిన ఈ కళా మహోత్సవాన్ని అందరూ తిలకించి పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, గతంలో కాకతీయరాజులు ప్రజల ఐక్యత, భాష, కళాభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారని, ఇప్పుడు సుబ్బరామిరెడ్డి తన కళాసామ్రాజ్యాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి ఎంతో మంది కళాకారులను ప్రోత్సహించడం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని ఇంత చక్కగా నిర్వహించడం ఒక్క సుబ్బరామిరెడ్డికే సాధ్యమన్నారు. ఇలా.. కళాకారులను సన్మానించడానికి టిఎస్సార్ (టి.సుబ్బరామిరెడ్డి) 120ఏళ్ళు జీవించాలని ఆయన నిండుమనసుతో ఆకాంక్షించారు. ఇదేవిధంగా మారుమూల గ్రామాల్లో ఉన్న పేద కళాకారులను కూడా గుర్తించి సన్మానం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచంలోని తెలుగువారందరినీ కలిపి ఒక వెబ్‌సైట్ రూపొందించాలని, అందులో తెలుగు భాషకు సంబంధించిన చరిత్ర, తదితర విషయాలన్నీ ఉండేవిధంగా చూడాలని సూచించారు. డైలాగ్‌లు చెప్పాలంటే, అవి ఎంత కఠినమైనవైనా..ఎన్టీఆర్ తర్వాత గుర్తుకు వచ్చేది మోహన్‌బాబేనని అన్నారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ, మోహన్‌బాబు నటన అద్భుతమని, అయిదు



తరాల ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న మోహన్‌బాబు 'విశ్వనట సార్వభౌమ' అవార్డుకు సంపూర్ణ అర్హులని అన్నారు. ఈ వేడుకల సందర్భంగా టిఎస్సార్ ప్రముఖ సినీహీరో మోహన్‌బాబుకు అందరి కరతాళధ్వనుల మధ్య 'విశ్వనట సార్వభౌమ' బిరుదును ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ హీరో, యువరత్న నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, ఇప్పటికీ లలిత కళలు బతికి ఉన్నాయంటే సుబ్బరామిరెడ్డిగారి లాంటి వారివల్లేనని కొనియాడారు. టిఎస్సార్ కాకతీయ కళాపరిషత్‌ను స్థాపించిన తొలిసారి మోహన్‌బాబును సత్కరించుకోవడమంటే మా చలనచిత్ర రంగాన్ని సన్మానించడంగా భావిస్తున్నానన్నారు. అనంతరం, దివంగత నటుడు టిఎల్ కాంతారావు కుటుంబానికి సుబ్బరామిరెడ్డి 5లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేసి అందరి ప్రశంసలందుకున్నారు. ఇంకా అనేకమంది కళాకారులను కాకతీయ లలిత కళాపరిషత్ వేదికపై టిఎస్సార్ ఘనంగా సత్కరించారు.

### కళలు దైవంతో సమానం - టిఎస్సార్

ఈ వేదికపై టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, కళలు దైవంతో సమానమన్నారు. అందుకే తాను కళాకారులను గౌరవించి సత్కరిస్తున్నానన్నారు. మోహన్‌బాబు 42 ఏళ్ళలో 6 వందల చిత్రాలకు పైగా నటించారని, విలన్‌గా నటించి హీరో అయి సుమారు 150 సినిమాల్లో హీరోగా నటించి భారతదేశ చలనచిత్ర రంగంలో సంచలనం సృష్టించారని మోహన్‌బాబును టిఎస్సార్ ఈ సందర్భంగా ప్రశంసించారు. 'మోహన్‌బాబు ఎంత గొప్ప నటుడో అంత ఖలేజా.. దమ్ము ఉన్న మనిషి అని, మోహన్‌బాబు కళాశాలను స్థాపించి 14వేల మంది విద్యార్థులకు చదువు చెప్తున్నారని, వీరిలో కనీసం నాలుగువేల మందికి ఉచితంగా విద్యను బోధిస్తున్నారని టిఎస్సార్ ఈ సందర్భంగా అభినందించారు. అలాంటి మోహన్‌బాబును 'విశ్వనట సార్వభౌమ' బిరుదుతో సత్కరించుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తెలుగువారు ఎక్కడున్నా కలిసిమెలసి ఉండాలన్నారు. తెలుగువారిని సమైక్యంగా పాలించినవారే కాకతీయ రాజులని, వారి ఆశయం మేరకు మనం ముందకు నడవాలని టిఎస్ఆర్ పిలుపునిచ్చారు. అనంతరం ఈ వేదికపై తెలంగాణ కళాకారులైన మధుప్రియ, దాము కొసనం, మంగ్లీ (సత్యవతి) గంగవ్వలను ఘనంగా సత్కరించారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక వేడుకలు




ఒక పండుగలా జరిగిన ఈ వేడుకల్లో డా. వద్మజారెడ్డి 'రాణీ రుద్రమదేవి' డ్యాన్స్ బాలే అందరినీ బాగా ఆకట్టుకుంది. అదేవిధంగా అమెరికా నుంచి వచ్చిన శ్రీమతి వనజాకుమారి 'యాదాద్రి నరసింహస్వామి' మరియు తెలంగాణ జానపద నృత్యాలు, లంబాడీ డాన్స్‌లు, శివారెడ్డి మిమిక్రీ, గురుస్వామి పేరడీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. డా. మాడుగుల నాగఫణిశర్మ, శ్రీమతి ఎంకెఆర్ ఆశాలత వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఎంతో కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకలో తెలంగాణ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మెన్ స్వామిగౌడ్, ప్రముఖ సినీ దర్శకులు కె.రాఘవేంద్రరావు, కోదండరామిరెడ్డి, ఎస్.గోపాల్‌రెడ్డి, బి. గోపాల్‌లతోపాటు శ్రీ దైవజ్ఞశర్మ, ప్రముఖ హీరోలు యువరత్న నందమూరి బాలకృష్ణ, మంచు విష్ణు, మంచు మనోజ్, ప్రముఖ హాస్యనటులు బ్రహ్మానందం, ఆలీ, సంపూర్ణేష్‌బాబు, ప్రముఖ సంగీతదర్శకుడు కోటి, నటీమణులు జయప్రద, జయసుధ, మంచు లక్ష్మి, శ్రియ, ప్రగ్యా జైస్వాల్, ఎంపీ జితేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీమతి డి.కె అరుణ, ఎమ్మెల్సీ షబ్బీర్‌హుస్సేన్‌లతోపాటు, డి.శ్రీనివాస్, శ్రీమతి గీతారెడ్డి, దానం నాగేందర్, పొంగులేటి సుధాకర రెడ్డి, పెద్దిరెడ్డి, కిషన్‌రెడ్డి, తదితర రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



### మాటలే ఈటెలై...

# హాట్‌హాట్‌గా జడ్పీ




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

ఈ నెల 20వ తేదీన జరిగిన నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం అధికార, విపక్షాల మధ్య వాదనలతో, విమర్శలతో వాడివేడిగా జరిగింది. ఒక ర్నొకరు తీవ్ర పదజాలాలతో విమర్శించుకున్నారు. ఎప్పుడు జడ్పీ సమావేశం జరిగినా జడ్పీటీసీలు, ఎంపీపీల కంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే సమావేశాన్ని హైజాక్ చేస్తుంటారు. ఈసారి సమావేశం లోనూ అదే జరిగింది. ముఖ్యంగా సాగు నీటి సమస్యలపై ప్రజాప్రతినిధులు విమర్శలు ఎక్కుపెట్టారు. ఐఏబి సమావేశంలో అధికారికంగా కేటాయించిన నీటిని కావలి కాలువకు ఎందుకు విడుదల చేయలేదంటూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి సోమశిల ఎస్.ఇ నాగూర్ మీరాను నిలదీసారు. కావలి కాలువకు 10.4టీఎంసీలు కేటాయించారని, రోజుకు 900 క్యూసెక్కులు వదలాల్సి వుండగా 700క్యూసెక్కులు మాత్రమే వదులుతున్నారని, నీళ్ళు లేక కావలి ప్రాంతంలోని చివరి ఆయకట్టు పొలాల్లో పైర్లు ఎండిపోతున్నాయని చెప్తూ దీనికి సంబంధించి పత్రికలలో వచ్చిన ఫోటోలను ఎమ్మెల్యే ప్రతాప్ సమావేశంలో చూపించారు. దీంతో ఎస్.ఇ నాగూర్ మీరా కోపంతో వూగిపోయి అవి ఫేక్ అంటూ ఆవేశంగా మాట్లాడాడు. అధికారులు టీడీపీ కార్యకర్తలు మాదిరిగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్యే ప్రతాప్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఫైర్ అయ్యాడు. ఎమ్మెల్యే ప్రతాప్‌పై ఆయన ఘాటు పదాలతో ఎదురుదాడి చేసాడు. ఇక్కడ ప్రతాప్ – బీదల మధ్య మాటలు ఈటెల్లా మారాయి. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జోక్యం చేసుకుని పరిస్థితిని కుదుట పరిచాడు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిలు సాగునీటి అంశంతో పాటు పలు సమస్యలను ప్రస్తావించారు.



వాదులాడుకుంటున్న ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే ప్రతాప్



# ఆయన అనర్హుడు

## - ఎమ్మెల్సీ యండపల్లిపై శాసనమండలి కార్యదర్శికి ఫిర్యాదు చేసిన బీద

ఒక సి.ఐ పై దాడి కేసులో ఇటీవలే రెండేళ్ళు జైలు శిక్ష పడ్డ పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డిని ఆ పదవికి అనర్హుడిగా ప్రకటించాలని టీడీపీ నెల్లూరుజిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర 22వ తేదీన శాసనమండలి కార్యదర్శి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. నేరం ఋజువై జైలు శిక్ష పడిన వాళ్ళను పదవుల్లో ఉంచరాదని సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా ఆయన శాసనమండలి కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళారు.

# 27న యువజన సదస్సు, భక్త సమ్మేళనం

శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీలలో నెల్లూరు దర్గామిట్టలోని స్వర్ణవేదిక కళ్యాణ మండపంలో యువజన సదస్సు, భక్త సమ్మేళనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ సేవాసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. 28వ తేదీ సాయంత్రం 5.30గంటల నుండి నెల్లూరు వి.ఆర్.హైస్కూల్ గ్రౌండ్‌లో రామకృష్ణ మిషన్ స్వామీజీలచే ఆధ్యాత్మిక బహిరంగ సభ జరుగుతుందని పేర్కొన్నారు.

# జాతీయ జీవిత బీమాకు 60ఏళ్ళు

## - బ్రాంచి మేనేజర్ రవిచంద్ర



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి)ను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేసి 60ఏళ్ళు గడచిన సందర్భంగా ఇటీవల బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గూడూరు టవర్‌క్లాక్ దగ్గర ఆ సంస్థ ఉద్యోగులు, ఏజెంట్లు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ రవిచంద్ర ఎల్ఐసిని జాతీయం చేసిన దినంగా ఈ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించామని, ఈ సంస్థ ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్ఐసి రాష్ట్ర ఈసీ సభ్యుడు ఇర్ల మాలకొండయ్య, జగదీష్ చంద్ర, ఆనిమెళ్ళ శివకుమార్, సిఐటియు నాయకులు కేశవులు, యూనియన్ గూడూరు శాఖ అధ్యక్షకార్యదర్శులు పి.దశరథరామయ్య, ఎన్.శివకుమార్, రామ్మోహన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికి ముగ్గులే అలంకారం

గూడూరు రెండో పట్టణం సిరామిక్ కాలేజీరోడ్డులోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంతంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడూరు మీరారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గూడూరు మాజీ పురపాలక సంఘం అధ్యక్షురాలు కోడూరు కల్పలత పాల్గొని మాట్లాడుతూ మహిళలలో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రంగవల్లుల పోటీలు వేదికగా నిలుస్తాయని, మహిళా మేధస్సుకు పరీక్షలు ముగ్గుల పోటీలని అన్నారు. కోడూరు మీరారెడ్డి మాట్లాడుతూ పండుగలకు ఇంటి ముందు వేసే ముగ్గులే ఇంటికి కళను తీసుకొస్తాయని తెలిపారు. మహిళలు పోటీతత్వం అలవరచుకోవాలని తెలిపారు. వారిలో వుండే ప్రతిభను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షులు, ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి పి.ఎస్. రాజ్యలక్ష్మి పాల్గొని బహుమతులు అందజేశారు. శేగు ప్రసాద్, బాలాజీ, ప్రకాష్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, సుభాన్, శ్రీను, కృష్ణారెడ్డి, అనీల్, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందజేస్తున్న కోడూరు కల్పలత, మీరారెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి

## గూడూరు డివిజన్ వార్తలు

# ఆటలతో ఆరోగ్యం... ఆనందం!

గూడూరు పట్టణం పిఆర్ క్లబ్‌లో జిల్లా స్థాయి వెటరన్ టెన్నిస్ టోర్నమెంట్ ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత టెన్నిస్ కోర్టులో ఫైనల్ పోటీ శ్రీకాళహస్తి – కావలి జట్ల మధ్య రసవత్తరంగా సాగింది. తుదిపోరులో విన్నర్‌గా శ్రీకాళహస్తి జట్టు, రన్నర్‌గా కావలి జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ రాంబాబు పాల్గొని మాట్లాడుతూ గూడూరులో వివిధ క్రీడలను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలగడంతో పాటు పోటీతత్వం, పట్టుదల, క్రమశిక్షణ సమకూరుతాయన్నారు. క్లబ్ కార్యదర్శి ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, విజయకుమార్ తదితరులు మాట్లాడుతూ క్లబ్ ద్వారా వివిధ క్రీడలను ఏటా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం గెలుపొందిన శ్రీకాళహస్తి జట్టు క్రీడాకారులు మన్మధరావు, మునికృష్ణారెడ్డి ప్రథమ బహుమతిని, కావలి జట్టు క్రీడాకారులు ప్రసాద్‌రెడ్డి, వంశీలకు ద్వితీయ బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పూడి లక్ష్మి, నారాయణ, వీరిబోయిన గోపాల్ కృష్ణయాదవ్, పులిమి శివకుమార్, గేమ్ సెక్రటరీ సురేంద్ర, సి.ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవే పెరుమాళ్ సేవ

పేదలకు సేవ చేయడం అభినందనీయమని ఎస్.వి.రత్నం చారిటీస్ ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర గోవిందమాల భక్తబృందం, ఎస్.వి.ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు ఫలసరుకులను, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మానవత్వం కలిగిన ప్రతి ఒక్కరూ దాన ధర్మాలు చేయడం ద్వారా సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పేదలు చదువుకునేందుకు ఆసక్తి ఉంటే ఎస్.వి.రత్నం చారిటీస్‌ను ఏప్రిల్ నెలలో సంప్రదిస్తే చదువుకునేందుకు అవసరమైన ఆర్థికసాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందమాల భక్తబృందం ప్రతినిధులు మనీష్, ఎస్.వి.ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, రెడ్ సంస్థ ప్రతినిధులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు, ఫలసరుకులు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రావు తదితరులు

శ్రీను గల్పిక

# నెతన్యాహు కోరికతో నోరు తెరచిన మోడీ!

న్యూఢిల్లీలోని పాలం విమానాశ్రయం. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రులు సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్‌సింగ్, అనంత కుమార్ తదితరులు వున్నారు. అప్పుడే ఒక స్పెషల్ ఫ్లైట్ ల్యాండయ్యింది. అందులో నుండి ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు దిగాడు. మోడీ ఆయనకు ఎదురెళ్లి ఆత్మీయంగా కౌగిలించుకుని స్వాగతం పలికాడు. నెతన్యాహు తనతో పాటు తెచ్చిన బ్యాగులను తెరిచాడు. అందులో నుండి మోడీకి ఇష్టమైన సూటూ, కోటు, వాచీలు తీసి ఆయనకు బహుమతిగా ఇచ్చాడు. అలాగే సుష్మాస్వరాజ్, నిర్మలా సీతారామన్‌లకు పట్టుచీరలు, పసుపు కుంకమలు అందజేసి మొన్న రక్షాబంధన్‌కు ఇండియా వచ్చి మీ చేత రాఖీ కట్టించు కోవాలనుకున్నాను! కాని, బిజీ వల్ల రాలేకపోయాను, ఈ అన్నయ్యను క్షమించండమ్మా! మీరే నా చెల్లెళ్ళు, ఈ రాఖీలు కట్టండి అంటూ వారి చేతులకు రాఖీలిచ్చి తన చేతికి కట్టించుకున్నాడు. నెతన్యాహు చూపించిన అభిమానానికి వాళ్ళకు ఏమీ అర్ధం కాలేదు. అక్కడ స్వాగత సత్కార్యాలయ్యాక అందరూ కార్లెక్కారు. కాన్వాయ్ బయలుదేరింది. మొదట తాజ్‌మహల్ వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడకు పెద్దఎత్తున భజరంగ్‌దళ్ కార్యకర్తలు చేరి వున్నారు. బెంజిమన్ నెతన్యాహు వారిని చూసి... వీళ్ళంతా ఎవరు? ఎందుకొచ్చారని అడిగాడు. వాళ్ళంతా భజరంగ్‌దళ్ సభ్యులు, తాజ్‌మహల్ ఒకప్పుడు శివాలయం అని వారి నమ్మకం. అందుకే ప్రతిరోజూ వచ్చి పూజలు చేస్తుంటారని మోడీ వివరించాడు. ప్రపంచంలో ఇదో వింత కదా అని నెతన్యాహూ అడిగాడు. దానికి రాజ్‌నాథ్‌సింగ్... మాకు ఈ సమాధి వింతేం కాదు, కాని బయట దేశాలవాళ్ళు వచ్చి దీనిని చూడడమే మాకు పెద్ద వింత అని చెప్పాడు. తాజ్‌మహల్ కట్టించిందెవరు? అని నెతన్యాహు అడిగాడు. వెంటనే అనంతకుమార్... దీనిని కట్టించిన తాపీమేస్త్రి బ్రతికిలేడు, అప్పుడే చచ్చిపోయాడు అని చెప్పాడు. తాజ్‌మహల్ అంటే వీళ్ళందరికీ ఒళ్ళు మంట లాగుందని గ్రహించిన నెతన్యాహు అది చూడ్డం ఆపి మళ్ళీ కారెక్కాడు. కాన్వాయ్ నేరుగా ప్రధాని కార్యాలయానికి చేరుకుంది. భారత్-ఇజ్రాయిల్ దేశాల అధికారులు, రాయబారులు, విదేశాంగ మంత్రులు అక్కడకు వచ్చేసారు. బెంజిమన్ నెతన్యాహుకు దోశెలు, చికెన్, అరిసెలు, వడలతో అల్పాహారం పెట్టారు. ఇవి ఎక్కడివి, ఈ వంటకాలను ఎప్పుడూ చూడలేదే అని నెతన్యాహు సందేహం వెలిబుచ్చాడు. అందుకు మోడీ... ఇవి సంక్రాంతి వంటకాలు... మా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నెల్లూరు నుండి పంపించాడు. బాగా వుంటాయి తినండి అని చెప్పి వడ్డించాడు. నెతన్యాహు వాటిని లొట్టలేసు కుంటూ తిన్నాడు.

తర్వాత ద్వైపాక్షిక చర్చలు మొదలయ్యాయి. ప్రధాని మోడీ... మా దేశ రక్షణ విషయంలో మీ సహకారం కావాలి. వంద యుద్ధ విమానాలు, 150 హెలికాప్టర్‌లు, అత్యాధునిక గన్‌లు లక్ష, 500 శతృఘ్నులు, 250 బాంబర్లు కావాలి... ఎంత డబ్బు చెల్లించాలో చెప్పండి అని మోడీ అడిగాడు. మీరు అడిగిన వాటికి రెండింతల ఆయుధాలు, యుద్ధ విమానాలు అందజేస్తాం. ఇక డబ్బు అంటారా? మీతో మాది స్నేహబంధమేకాని వ్యాపార బంధం కాదు అని నెతన్యాహు చెప్పాడు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వుండి... మా సరిహద్దుల్లో చైనా, పాక్‌లతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయి. మా సరిహద్దుల్లోకి చొరబడుతున్నారు. కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. వారితో మాకు ఎప్పుడైనా యుద్ధం రావచ్చు. వాళ్ళతో యుద్ధమే వస్తే మాకు మీ సాయం కావాల్సి వుంటుందని అడిగింది. నెతన్యాహు దానికి బదులిస్తూ... ఇక్కడ మీరు వేరు కాదు, మేము వేరు కాదు... మన దేశాలు వేరు కావొచ్చేమో, రెండింటి ప్రాణం మాత్రం ఒక్కటే! మీ దేశం మీదకు ఎవరైనా యుద్ధానికి వచ్చారంటే వాళ్ళు మా దేశం మీదకు కూడా వచ్చినట్లే! మీ గుండెకు గాయమైతే మా గుండెకు గాయమైనట్లే! మీరు ఓడిపోతే మేము ఓడిపోయినట్లే! మీరు గెలిస్తే మేం గెలిచినట్లే... అని ఎంతో అభిమానం చూపిస్తూ చెప్పాడు. కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ వుండి... వ్యవసాయ రంగంలో మేమింకా చాలా వెనుకబడి వున్నాం. మీరు మాకంటే ఎంతో ముందున్నారు. ఏడారిలో కూడా పంటలు పండిస్తున్నారు. మీ వ్యవసాయ టెక్నాలజీని మా రైతులకు కూడా నేర్పించాలి. అందుకు ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాం అని చెప్పాడు. ఆ మాట వినగానే నెతన్యాహు కాలికున్న చెప్పును చేతిలోకి తీసుకున్నాడు. ఆ సంఘటనతో అందరూ షాకయ్యారు. నెతన్యాహు తన చేతిలోని చెప్పును మోడీ చేతిలో పెట్టి... ఇంకోసారి మన మధ్య 'డబ్బు' అనే మాట వినిపిస్తే ఈ చెప్పుతో నన్ను కొట్టండి, మీరు కొట్టకుంటే నేనే కొట్టుకుంటాను. మన మధ్య డబ్బు అనే మాటే వుండకూడదు. మన బంధానికి డబ్బు అడ్డురాకూడదు అని చెప్పాడు. నెతన్యాహు చూపిస్తున్న ప్రేమకు మోడీతో పాటు అక్కడున్న అందరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి. మోడీ మనసులో నేను పీఎం అయ్యాక ఒబామాను చూసాను, ట్రంప్‌ను చూసాను, థెరిసామే, మోర్కెలా ఏంజిల్, షిజోఅంబే, నవాజ్ షరీఫ్, జిన్‌పింగ్‌లు... ఇలా ఎంతోమందిని కలిసాను. అందరూ తమ దేశ ప్రయోజనాలు చూసుకొన్నవాళ్ళే గాని, అవతల దేశం గురించి ఆలోచించినవాళ్ళు లేరు. కాని నెతన్యాహు నిజమైన మిత్రుడు, తన దేశం కంటే కూడా అతను భారతదేశం గురించి ఎక్కువుగా ఆలోచిస్తున్నాడు. థాంక్‌యు నెతన్యాహు అని అనుకున్నాడు. సుష్మాస్వరాజ్ వుండి... భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వం కోసం మీరు మద్దతు ఇవ్వగలరా? అని అడిగింది. అది విని నెతన్యాహు... ఇవ్వగలరా? సహకరించగలరా? అనే ప్రశ్నలే వద్దక్కా, మీరు ఆదేశించాలి, నేను పాటించాలి. మీ కోసం నేను బావిలో దూకమన్నా దూకుతాను, మీరు ఇక్కడ సంతకం పెట్టండి అని చెబితే చాలు కళ్ళు మూసుకుని ఎక్కడైనా పెట్టేస్తాను. నేను మీ మనిషిని. పరాయివాడిగా చూడొద్దు అని నిష్టూర పోయాడు.

అప్పుడు మోడీ అతనితో... నువ్వు మాలో మనిషివే, మా మనిషివే... నువ్వు మా పట్ల ఇంత ప్రేమాభిమానం చూపిస్తున్నావ్, ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలం అని అన్నాడు. అందుకు నెతన్యాహు... మీరు నాకు ఏమీ ఇవ్వబల్లేదు. నాలుగు టన్నులు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలన్పిండి... అవి నా దగ్గరుంటే చుట్టుపక్కల అరబ్బు దేశాలకు వణుకు పుట్టిస్తాను అని తన మనసులోని మాటను చెప్పాడు. అది విని మోడీతో సహా అందరూ నెల్లూరు దోమలు ఇంత పవర్‌ఫుల్లా అని నోర్లు తెరిచారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

రావలసిన బాకీలు కొంత లభించగలవు. ముఖ్య పనులను బాధ్యతలను ఇతరులకు అప్పగించవద్దు. విద్యార్థులు బాగా కష్టపడాలి. వర్కర్ల సమస్యలు యజమానులకు ఉంటాయి. ఉపాధి పథకాలు సంతృప్తికరం. తండ్రివర్గ బంధువులకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. డబ్బుకు ఇబ్బంది లేకుండా వృత్తి వ్యాపారాలు బలపడి ఆదాయం పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

విద్యా ప్రగతి బాగుంటుంది. ప్రముఖుల పరిచయాలు, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. మీ సలహాలు సూచనలు ఇతరులకు ఉపయోగపడతాయి. అనుకున్న పనులు సవ్యంగా జరగడానికి ఇతరుల సహాయం లభించగలదు. గౌరవ మర్యాదలు బాగుండి, సభలు సమావేశాల నిర్వహణలో ప్రయత్నాలు చేస్తారు. వృత్తి పరంగా రాబడి సంతృప్తికరం.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వాణిజ్య ఒప్పందాలకు అవకాశాలు వస్తాయి. బంధువుల నుండి అనారోగ్య వార్తలు వింటారు. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారవృద్ధికి మీ ప్రయత్నాలు అనుకూలమై ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. ఆరోగ్యం బాగుండును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక ఒప్పందాలు కుదరడం, ఋణాలు లభించడం జరుగుతుంది. కొన్ని విషయాలలో కుటుంబ సభ్యులతో రాజీపడవలసి వస్తుంది. ఉద్యోగులు విధి నిర్వహణ ప్రశాంతంగా జరుపుకొంటారు. అధికారుల దాడులు, వత్తిడులుండవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆర్థిక స్థితి క్రమంగా మెరుగు కాగలదు. వ్యాపారాలు, వృత్తి జీవనాలు సామాన్యంగా జరిగి ఆదాయం ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కళా క్రీడా సాంకేతిక రంగాలవారికి అవకాశాలు బాగుంటాయి. దూరప్రయాణాలుంటాయి. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆరోగ్యం లోపం కలుగకుండా జాగ్రత్త పడాలి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వస్తువులు, కాగితాలు జాగ్రత్త పరచుకొనండి. ప్రముఖులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి విస్తరణ జరుపుతారు. నూతన వస్తువులు సమకూరుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొత్త కాంట్రాక్టులు లీజులు లభించగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. దూర ప్రయాణాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. మీ సమర్థతకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 26.1.2018 నుండి

తేది. 1.2.2018 వరకు

ఈ వారము వృషభ, మిధున, కర్కాటక, సింహ రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో శని, మకరంలో రవి బుధ కేతు శుక్రులు సంచరిస్తారు.

పంచాంగము

తేది 26 శుక్రవారము భారత రిపబ్లిక్ దినోత్సవము

తేది 31 బుధవారము గ్రస్తోదయ సంపూర్ణ చంద్రగ్రహణము.

పుష్యమి ఆశ్రేష నక్షత్రములవారు గ్రహణము చూడరాదు.

ఆబ్దికములన్ని గ్రహణానంతరమే.

### మాఘ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | నవమి | ఉ॥ గం.9.01వ॥ |
| తేది. 27 | శని | దశమి | ఉ॥ గం.7.13వ॥ |
| | పిదప | ఏకాదశి | రా॥గం.5.2వ॥ |
| తేది. 28 | ఆది | ద్వాదశి | రా॥ గం.2.46వ॥ |
| తేది. 29 | సోమ | త్రయోదశి | రా॥ గం.12.25వ॥ |
| తేది. 30 | మంగళ | చతుర్దశి | రా॥ గం. 10.05వ॥ |
| తేది. 31 | బుధ | పూర్ణిమ | రా॥ గం.7.50వ॥ |
| తేది. 1 | గురు | పాడ్యమి | సా॥ గం.5.45వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సభలు, సమావేశాలందు ప్రముఖంగా పాల్గొంటారు. అధికారులకు బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. మీవి కాని విషయాలలో జోక్యం వద్దు. ఆరోగ్యం ఫరవాలేదు. సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించగలరు. వృత్తి వ్యాపారాలు వేగం పుంజుకుంటాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు, అధికారుల ఆదరణ బాగుంటుంది. కోర్టు వ్యవహారాల విషయంలో పన్నుల చెల్లింపు వ్యవహారాలలో సంప్రదింపులు చేస్తారు. దూర ప్రయాణాలు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అనుకూలత బాగుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

బంధుమిత్రులను కలుసుకొంటారు. వారం మధ్యలో శుభవార్తలు వింటారు. నూతన వస్తు, వస్త్రాలు సమకూరుతాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలుండవచ్చును. విద్యార్థులకు మంచి అభివృద్ధి కలదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. అనుకున్న పనులు నిదానంగా సానుకూలం కాగలవు. కుటుంబ వ్యక్తులతో స్వల్ప విభేదాలుండవచ్చును. రాబడి పెరుగుదల ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులను ఉపాయం తెలివితేటలు చూపి జరుపుకొనవలసి ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. దూర ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు శ్రమ అధికం. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఆడిటర్లు, కళాక్రీడా సాంకేతిక రంగాల వారికి బాగుంటుంది. ఈ వారం ఖర్చులు అధికంగా ఉండగలవు. అయినా డబ్బుకు ఇబ్బంది కలగదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఎటువంటి వత్తిడులకు మొగమాటాలకు లొంగవద్దు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. మిమ్మల్ని అభిమానించే వారు పెరుగుతారు. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. చేయదలచిన పనులకు సొంత పర్యవేక్షణ అవసరం. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారవృద్ధి ప్రయత్నాలు అనుకూలించి ఆదాయం పెరుగుతుంది. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. ప్రయాణాలు వాయిదా పడగలవు. ముఖ్య పత్రాలు, నోటీసులు అందుకొంటారు. కోర్టు కేసులందు అనుకూలత కలదు. సోదరులతో కొద్ది విభేదాలు రావచ్చును. ఆరోగ్యం బాగుంటుంది. బాకీలు నిలబడిపోతాయి. కాని ఆర్థిక ఇబ్బందులుండవు.

## వ్యవసాయ అనుబంధ రంగాలకు

# పుష్కలంగా నిధులు

**- మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



గిడ్డంగులను ప్రారంభిస్తున్న మంత్రులు సోమిరెడ్డి, నారాయణ తదితరులు

రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చి పుష్కలంగా నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇనమడుగు గ్రామంలోని పడుగుపాడు ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం గిడ్డంగుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి, పురపాలక మంత్రి డా. పి.నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇక్కడ 66.50లక్షల అంచనాతో 1100 మెట్రిక్ టన్నుల వ్యవసాయ గిడ్డంగి ప్రారంభోత్సవం, 55 లక్షల అంచనాతో వెయ్యి మెట్రిక్ టన్నుల వ్యవసాయ గిడ్డంగులకు మంత్రులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రెండు రైతు రథాలను, నాలుగు ట్రాక్టర్ల పనిముట్లను లబ్దిదారులకు అందజేశారు. మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సబ్సిడీ రూపంలో 1120కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఎకరాలకు నూరుశాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రధమస్థానంలో ఉందని, వ్యవసాయ అనుబంధశాఖలకు దేశం మొత్తంలో 2.5 శాతం వృద్ధి రేటు కాగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో 25.6 శాతం వృద్ధిరేటు సాధించామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, నెల్లూరు బ్యారేజీ నిర్మాణం జూన్ నాటికి పూర్తవుతుందని, అదేవిధంగా సంగం బ్యారేజీ నిర్మాణం పనులు అక్టోబర్‌కల్లా పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డిసిసి బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆర్డీఓ శ్రీమతి డి.హరిత, వ్యవసాయశాఖ జె.డి చంద్రనాయక్, జెట్టి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అభినందన

పెద్దపండుగ జరుపుకోవడానికి ఇటీవల నెల్లూరుకు వచ్చి 6రోజుల పాటు బసచేసిన భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం మరియు కర్నాటక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రావి మోహన్‌చౌదరి.

# ఐదేళ్ళలో అద్భుత ప్రగతి

**- డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు**



ప్రస్తుత పాలక వర్గ సభ్యులు, సిబ్బంది సహకారంతో తమ ఐదేళ్ళ పాలనా కాలంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అభివృద్ధిపథంలో ఎంతో ముందుకు తీసుకెళ్ళామని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము బాధ్యతలు చేపట్టిన 2013 ఫిబ్రవరి19 నాటికి బ్యాంకు 417.64లక్షల నష్టాల్లో వుండగా, జనవరి 19,2018 నాటికి 20.73లక్షల లాభాల్లోకి తీసుకెళ్ళామన్నారు. 2013లో 8706.17 లక్షలు డిపాజిట్లు వుండగా ప్రస్తుతం 23651.62లక్షల డిపాజిట్లు వున్నాయని, అందరి సహకారంతో బ్యాంకు డిపాజిట్లు 87కోట్ల నుండి 237కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. అన్ని బ్యాంకులకంటే కూడా డిపాజిట్లపై అధికశాతం వడ్డీనిస్తున్నాం. జిల్లా బ్యాంకు కార్యాలయంతో పాటు అన్ని బ్రాంచ్‌లను ఆధునీకరించాం. బ్యాంకు ద్వారా డెబిట్‌కార్డులు, రూపే కార్డులు అందజేస్తున్నాం. బ్యాంకులో ఆర్‌టిజిఎస్, నిఫ్ట్ సౌకర్యాలు కల్పిస్తున్నాం. స్వల్పకాలిక ఋణాలు తీసుకున్న రైతులకు అతితక్కువ ప్రీమియంతో లక్ష రూపాయల వ్యక్తిగత ప్రమాద బీమా కల్పిస్తున్నాం. ప్రధాన బ్యాంకు బ్రాంచ్‌లలో ఏటిఎంలు ఏర్పాటు చేయడం జరిగింది. 2017 సెప్టెంబర్ 8వ తేదీన బ్యాంకు శతవసంతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని ఆయన తెలిపారు.




జననం: 7.5.1925

మరణం: 27.1.1998

**20వ వర్ధంతి**

ఎల్లవేళలా ఇతరుల శ్రేయస్సును కోరుకుంటూ
అహర్నిశలు మా అభివృద్ధికి పాటుపడిన
మా పెద్దాయన
**శ్రీ జి.వి.రమణయ్య గారి**
ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్
**20వ వర్ధంతి** సందర్భంగా
వారి పవిత్రాత్మకు ఆ భగవంతుడు
శాంతిని చేకూర్చాలని కోరుకుంటూ...

**- కుటుంబసభ్యులు**





ఆకలిదప్పులు లేని, అవినీతి తెగులు సోకని, అపరిశుభ్రతకు దూరంగా మసలే అపురూప మనోహర దృశ్యకావ్యం.. దుబాయ్!.. ఎటుచూసినా క్రమశిక్షణతో అలరారుతుంది. స్వీయ నియంత్రణే దుబాయ్ విజయరహస్యం. రోడ్లు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయి. పనిచేయని సోమరిపోతుకు తావుండదక్కడ. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పరిశ్రమించడం దుబాయ్ వాసుల సొంతం.

వ్యవసాయం లేకపోయినా తిండిగింజలకు కరువు లేని ప్రణాళిక అక్కడి రాజు రూపొందించిన అద్భుత ప్రహేళిక. సంవత్సరానికి అర్ధగంట లోపే వర్షం కురిసినా కరువు కరాళనృత్యం చేయదక్కడ. పెట్రోలు బావుల్ని ఎరచూపి, టూరిజం మంత్రదండంతో అన్ని ఆహారధాన్యాలను సమృద్ధిగా దిగుమతి చేసుకోవడం, గొప్ప ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడం వారికి అలవాటు. వర్షపాతం లేకపోయినా సముద్రపు నీటిని డీశాలినేషన్ చేసి వాడుకోవడం, ఉపయోగించే నీటిని శుభ్రపరచి ఇతరత్రా వినియోగాలకు కేటాయించడం వారి ప్రత్యేకత. రోడ్లపైన పోలీసులు, విజిల్స్ మోతలసలే ఉండవు. కానీ, రోడ్డు నియమాలు తు.చ తప్పకుండా అందరూ పాటిస్తారు. ఏమాత్రం అదుపు తప్పినా రాడార్ నిఘానేత్రంలో నడిచే వ్యవస్థలో పోలీసులు క్షణాల్లో వాలిపోతారు. ఓ వాహనం లయ తప్పితే పెనాల్టీలతో పల్టీలు కొట్టిస్తారు. దాంతో ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ అలవరచుకోవడం ఇక్కడ ఆనవాయితీ అయింది.

పాదచారులకు చక్కని విలువనిస్తుంది దుబాయ్ ప్రభుత్వం. వారి కోసం రోడ్లపైనే గుర్తులు పెట్టడం, రోడ్లపై ప్లాట్‌ఫారాలు నిర్మించడం జరిగింది.

వరల్డ్ టాలెస్ట్, వరల్డ్ ఫాస్టెస్ట్, వరల్డ్ స్పీడెస్ట్.. వంటి రికార్డులు దుబాయ్ సాధించిన ఘనవిజయాలు. 160 అంతస్తుల 'బుర్జ్ ఖలీఫా' భవనం వరల్డ్ టాలెస్ట్ బిల్డింగ్. లిఫ్ట్‌లో ఎలాంటి భయం సోకకుండానే 15 సెకన్లలో 124వ అంతస్తులోకి చేరుకోగలుగుతాం.

దుబాయ్‌లో మాల్స్‌సందడి ఎక్కువ. ఎటుచూసినా మాల్స్ దర్శనమిస్తాయి. దుబాయ్ మాల్ ఇంచుమించు మన నెల్లూరులో సగం ఉంటుందంటే అతిశయోక్తి కాబోదు. ఫెరారి వరల్డ్‌లోని యాస్ మాల్ అబుదాబిలో మరో పెద్ద మాల్.

బంగారు ఆభరణాల ప్రియులకు దుబాయ్ భూతలస్వర్గం. స్టీలు సామాను అంగళ్ళలా ప్రత్యక్షమవుతాయి బంగారు అంగళ్ళు. దుబాయ్ బంగారానికి ప్రపంచంలో విపరీతమైన గిరాకీ ఉంది. అందుకే దుబాయ్ వెళ్ళినవాళ్ళు బంగారం కొనడం రివాజయ్యింది.

నిన్న మొన్నటివరకు ట్యాక్స్ అంటే ఏమిటో తెలియని దుబాయ్ ఇప్పుడు వ్యాట్ ట్యాక్స్ వేయడం నేర్చుకుంది. అన్ని అమ్మకాలపై 5శాతం వ్యాట్ విధిస్తున్నది.

గత 46 ఏళ్ళుగా ఏర్పడిన దుబాయ్ సామ్రాజ్యంలో ఒక్క క్షణం కూడా కరెంట్ పోని విశిష్టత ఆ దేశానిదే. అక్కడ క్రైమ్ రేటు అత్యంత కనిష్టస్థాయిలో ఉంటుంది. ఎటువెళ్ళినా భద్రతే!.. అభద్రతా ఆనవాళ్ళు కనిపించవక్కడ. నిజంగా రామరాజ్యం..దుబాయే!..

రోడ్లంతా తీర్చిదిద్దినట్లుగా ఉంటాయి. ప్రణాళికాబద్ధంగా దుబాయ్ ఏర్పడడంతో అక్కడి ఇళ్ళు, అంగళ్ళు అన్నీ ఓ చిత్రం బిగించినట్లుంటాయి. మన హృదయాల్ని తాకుతాయి.

దుబాయ్‌లో ఆటోలకు తావుండదు. స్కూటరిస్టులు ఉండరు. ఉన్నా ఒకరిద్దరు మాత్రమే తిరుగుతారు. అదో కార్ల ప్రపంచం. ఖరీదైన ప్రపంచం.

దుబాయ్‌లో.. ప్రపంచంలోని అన్ని దేశాలవారు నివాసమేర్పరచుకుని ఉండడంతో అందరినీ అక్కడ చూడవచ్చు. టూరిజానికి ప్రాధాన్యతనిచ్చే దుబాయ్‌లో అక్కడి ప్రజలు మర్యాద మన్ననలు కలిగినవారు కావడం విశేషం.

అక్కడ భిక్షాటన పూర్తిగా నిషిద్ధం. ప్రతిఒక్కరూ పనిచేసుకుని జీవించాల్సిందే తప్ప భిక్షాటన చేయడం నేరం. 63ఏళ్ళ వయసు వరకు పని దొరుకుతుంది. రిటైరైన వ్యక్తులు వాళ్ళ దేశాలకు తరలిపోవాల్సివస్తుంది.

అబుదాబిలో ఓ మసీదు ఉంది. అక్కడి పరిశుభ్ర వాతావరణం, వాళ్ళు మసీదును నిర్వహిస్తున్న తీరు చూసి ఆశ్చర్యచకితులమవుతాం. ఇది ప్రపంచంలో మూడవస్థానం పొందిన మసీదుగా చెప్పబడింది. ప్రపంచంలోని అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్‌లో కూడా అంతటి నిర్వహణా సామర్థ్యం కనిపించదంటే అతిశయోక్తి కాదు.

కేవలం 46 ఏళ్ళలోనే ప్రపంచానికే తలమానికంగా ఎదగగలగడం దుబాయ్‌కే చెల్లింది. పంటలు పండని, వర్షం కురవని దేశంలో దుబాయ్ రాజు ఎంత ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి ఆ దేశాన్ని సంపన్నదేశంగా విలసిల్లేలా తీర్చిదిద్దగల్గడం ఆయన దార్శనికతకు చక్కని ఉదాహరణ.

దుబాయ్ మనందరికీ ఓ మధురస్వప్నంగా..మన కలల సౌధంగా తోస్తుంది. ప్రభువులు సమర్థులైతేనే గదా ప్రజలు సుఖపడేది!....

# డోంట్ వర్రీ.. ఇప్పుడు మీకోసం...

# ఫ్రీ హోమ్ డెలివరీ

## - నెల్లూరీయులకు అందుబాటులో..ఆన్‌లైన్ ప్రావిజన్స్

ONLINE PROVISIONS.com

నెల్లూరీయులు నిత్యావసర వస్తువుల కోసం ఇక నానా హైరానా పడనక్కరలేదు. నేరుగా, మీ ఇంటికే..మీ చెంతకే అందుబాటులోకి వచ్చేసింది ఆన్‌లైన్ ప్రావిజన్స్. ఇక ఏ చింతా అక్కరలేదు. మీ ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, ఫ్యాన్సీ ఐటమ్స్, బేబి టాయ్స్, బర్త్‌డే కేక్స్..ఏది కావాలన్నా సరే, ఒక్క ఫోన్‌తోనే మీరు వాటిని పొందే సదవకాశం వచ్చేసింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా దూసుకుపోతున్న ఈ కాలంలో మనకు అవసరమైన వస్తువులను తెచ్చుకునేందుకు తగిన సమయం కూడా ఉండాలి. ఎంతెంతో దూరం వెళ్లి వాటిని తెచ్చుకోవాలి. ఇక, అలాంటి శ్రమ ఏదీ ఉండదు. ఫోన్ ద్వారానైనా, వాట్సాఫ్ ద్వారానైనా సరే మీరు ఆర్డర్ చేస్తే చాలు... ఆయా వస్తువులు మీ ఇంటి ముంగిట్లోకి వచ్చి వాలుతాయి. నాణ్యత, సరసమైన ధర, ఫ్రీ హోమ్ డెలివరీ అన్నీ కలగలిసి మీ చెంతకు వచ్చేసింది.. ఆన్‌లైన్ ప్రావిజన్స్. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. 'ఆన్‌లైన్ ప్రావిజన్స్ డాట్ కామ్'పై క్లిక్ చేస్తే మీరు కొనుగోలు చేయాలనుకున్న వస్తువులు మీ ఇంట్లో ఉన్నట్లే. సింహపురి ప్రజలకు ఇదే మా ఆహ్వానం. మా ద్వారా మీకు కావాల్సిన సమాచారాన్ని 'ఆన్‌లైన్ ప్రావిజన్స్' ఫోన్ నంబర్లు : 9291292913, లేదా 9866770305 లతో సంప్రదించవచ్చు.

## క్యాన్సర్ హాస్పిటల్‌కు 1.5 లక్షల విరాళం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కు హైదరాబాద్ అపోలో హాస్పిటల్ హోమియోపతి వైద్యులుగా సేవలందిస్తున్న వి.వి.నాగరాజారావు, బాలామణి దంపతులు రూ.1లక్ష విరాళాన్ని, అనుపిండి రామచంద్రరావు రూ.50వేల విరాళాన్ని ఇటీవల క్యాన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజారావు మాట్లాడుతూ ఈ వైద్యశాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బాల్యస్నేహితుడైన నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మెన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం సలహామేరకు పేద క్యాన్సర్ రోగగ్రస్తులకు ఉచితంగా మందులు ఇచ్చేందుకు ఈ విరాళాన్ని వినియోగించుకోవాలని తనవంతు సాయంగా అందజేసినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## కొత్తూరు శ్రామికనగర్‌లో రోటరీ సేవలు




మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నెల్లూరురూరల్ మండలం కొత్తూరు శ్రామిక నగర్‌లోని శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి దేవాలయంలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛభారత్‌లో భాగంగా శ్రామికనగర్‌లో గ్రామస్థుల సౌకర్యార్థం పబ్లిక్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ వొమ్మిన నాగసతీష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవల్ని మరింత విస్తృతం చేస్తుండడం ఆనందదాయకమన్నారు. రోటరీక్లబ్ నెల్లూరు సౌత్ అధ్యక్షురాలు కంచి నీరద గుడిని నిర్మించి అన్ని విధాలుగా సహకరిస్తూ శ్రామికనగర్ ప్రజానీకానికి తనవంతు సహాయం చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గాదంశెట్టి గోపాల్, కంచి నీరద, వి.సుధాకర్‌రెడ్డి, వెంకటాద్రిరెడ్డి, సీతాదేవి, బి.ఎన్.రాజు, శ్రీహరి, హరీష్, ఎం.సతీష్‌కుమార్, వసంతరావు, సుభద్రాదేవి, వెంకట్రాజు పాల్గొన్నారు.

### మైథిలి విద్యార్థుల

# ప్రత్యేక యోగాసనాలు



నెల్లూరు వేదాయపాలెం చంద్రమౌళీనగర్‌లోని మైథిలి స్కూల్‌లో రథసప్తమి సందర్భంగా ప్రత్యేకంగా విద్యార్థులు సామూహికంగా సూర్యనమస్కారాలు, వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రథసప్తమి విశిష్టతను, సూర్య నమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. స్కూల్ ఫౌండర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం పెంపొందించుకోవడంలో యోగాసనాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని, ఈ ఆసనాలను ఎవరైనా సులభంగా నేర్చుకోవచ్చునని, నిత్యం ఆచరించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రెయిన్‌బో పుస్తక ప్రదర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అన్ని వయసుల వారికి వివిధ రకాల పుస్తకాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు పుస్తక ప్రదర్శన వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలలో పుస్తక పఠనం పెంపొందించడానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇంటర్నెట్ సదుపాయాలు లేని కాలంలో పుస్తకం మనిషికి ఒక మంచి మిత్రుడిగా వుండేదన్నారు. దీనివల్ల భాషా పరిజ్ఞానం, ఆలోచనాశక్తి, భావుకత, విజ్ఞానం వంటివి చిన్నారుల్లో పెంపొందుతాయన్నారు. పాఠశాల డైరెక్టర్ పద్మ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణ, ఫాతిమాఖాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'విపిఆర్ విద్య'లో సూర్యనమస్కారాలు

గొలగమూడిరోడ్డులో ఉన్న విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విపిఆర్ విద్య' పాఠశాలలో ఈ నెల 24న రథసప్తమిని పురస్కరించుకుని విద్యార్థులు ఎంతో శ్రద్ధతో సూర్యనమస్కారాలు చేశారు. ఆరోగ్యానికి ప్రతీకగా సూర్యదేవుని ఆరాధించడం భారతీయ సంప్రదాయమని పేర్కొంటూ, సూర్యుని ద్వాదశ నామాలను స్మరిస్తూ విద్యార్థులంతా ఎంతో భక్తిశ్రద్ధలతో సూర్యనమస్కారాలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కటకటాలకు వాకాటి



***ఆయన పొద్దున బ్రేక్‌ఫాస్ట్ రాహుల్‌గాంధీతోనూ, లంచ్ అహ్మద్‌పటేల్‌తోనూ, డిన్నర్ గులాంనబీ ఆజాద్‌తోనూ చేస్తుంటాడు. ఆయన నోటికి జాతీయ స్థాయి నాయకులు తప్పితే రాష్ట్రస్థాయి నాయకులు అసలు అనరు. ఆయనను కలిసి మాట్లాడుతుంటే... ఇప్పుడే సోనియాగాంధీ ఫోన్ చేసింది, అర్జంట్‌గా ఢిల్లీకి రమ్మంది... ఈమధ్య నేను ఢిల్లీలో కనిపించడం లేదని దిగ్విజయ్ సింగ్ అలిగివున్నాడు... నెల్లూరు జిల్లాలో ఈ తరహా కోతల రాయుడు... సారీ కోతల నాయకుడు ఎవరయ్యా అంటే ఎవరికైనా టక్కున గుర్తొచ్చే పేరు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి. ఆయన చేతలేమోగాని మాటలు మాత్రం ఎప్పుడూ కోటలు దాటుతుంటాయి.***


నిన్నమొన్నటి దాకా కూడా ఆయన చిన్నగా వెలగలేదు. లగ్జరీ కార్లు, సెవెన్‌స్టార్ హోటళ్ళలో బస... ఇక అక్కడ ఏమేం చేసేవారన్నది వేరే సంగతి. విమానాల్నే లీజుకు తీసుకుని తిరగడం... ఇవన్నీ సొంత డబ్బులతో చేసుకుని వుంటే ఎవరికీ వచ్చిన నష్టం ఏమీ లేదు. కాని, వీళ్ళు సొంత డబ్బులతో జల్సాలు చేయలేదు. వందల కోట్లు తమ తాతల ఆస్తులు అన్నట్లుగా బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్నారు. ఆ డబ్బులతో జల్సాలు చేశారు. పార్టీ టిక్కెట్లు, పదవులు కొన్నారు. ఇప్పుడు బ్యాంకుల బకాయిలు తీర్చకుండా ఎగవేస్తున్నారు.

బ్యాంకులను మోసం చేసి వందలు, వేల కోట్లు ఎగనామం పెట్టిన నాయకులను తెలుగుదేశం పార్టీ కాపాడుతుందనే ప్రచారం విస్తృతంగా వుంది. బ్యాంకుకు బకాయిలు ఉన్నోళ్ళు తెలుగుదేశంలో చేరితే చాలు... బకాయిలు కట్టాల్సిన అవసరం లేదన్నంత భరోసా వుంది. ఈ భరోసాతోనే కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీగా వుండిన వాకాటి నారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరడం జరిగింది.

విఐఎస్ఆర్ ఇన్‌ఫ్రాతో పాటు పలు కంపెనీలకు అధిపతి అయిన వాకాటి నారాయణరెడ్డి పలు బ్యాంకుల నుండి 443.27 కోట్లు అప్పులు తీసుకుని వున్నాడు. తన ఆస్తుల విలువను ఎక్కువగా చూపించి బ్యాంకులకు తనఖాపెట్టాడు. ఎకరా భూమి మార్కెట్‌లో పది లక్షలుంటే ఆయన దానిని కోటిగా చూపించేవాడు. ఇలా ఆయన బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులకు తాకట్టు పెట్టిన ఆస్తులకు పొంతన లేకుండా పోయింది. బ్యాంకులనే ఆ స్థాయిలో బురిడీ కొట్టించాడు వాకాటి. ఆయన సకాలంలో బ్యాంకులకు తిరిగి ఋణాలు చెల్లించకపోవడంతో ఆయనను డిఫాల్టర్‌గా ప్రకటించి ఆస్తుల జప్తుకు బ్యాంకులు గతంలోనే నోటీసులు జారీ చేసాయి. కాగా, ఇదే క్రమంలో వాకాటి నారాయణరెడ్డి తమ నుండి 190 కోట్లు ఋణం తీసుకుని మోసం చేసాడని తప్పుడు డాక్యుమెంట్లు కారణంగా తమ సంస్థకు 205కోట్లు నష్టం వాటిల్లిందని ఐఎఫ్‌సిఐ(భారతీయ పారిశ్రామిక ఆర్థిక సంస్థ) సిబిఐకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన సిబిఐ ఈ కేసులో వాకాటితో పాటు ఐఎఫ్‌సిఐ డిజిఎం వి.సి రామ్మోహన్‌ను మరో నలుగురిని నిందితులుగా చేర్చి వీరిపై 120బి, 420 ఐపిసి సెక్షన్‌ల క్రింద కేసులు నమోదు చేసింది. విచారణ నిమిత్తం సిబిఐ అధికారులు నోటీసులు జారీ చేయడంతో వాకాటి నారాయణరెడ్డి 21వ తేదీ బెంగుళూరు వెళ్ళాడు. అక్కడ ఆయనను విచారించిన అధికారులు ఈ కేసులో ఆయనను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. వాకాటి వ్యవహారం ఇప్పుడు తెలుగుదేశంపార్టీలో కలకలం రేపుతోంది. కాంగ్రెస్ నుండి వచ్చిన వాకాటిని గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబెట్టి మళ్ళీ ఎమ్మెల్సీని చేశారు. అప్పటికే ఆయన మీద తీవ్ర ఆర్థిక నేరారోపణలుండినాయి. జిల్లా పార్టీలోనే పలువురు నాయకులు ఆయనకు సీటివ్వడాన్ని వ్యతిరేకించారు. అయినా లోకేష్‌బాబును ప్రసన్నం చేసుకుని ఉండడంతో వాకాటికి సీటొచ్చింది. ఆ వెంటనే వాకాటికి సంబంధించి ఆస్తుల జప్తుకు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. మీడియాలో ఈ వార్త ప్రధానంగా చర్చకు రావడంతో చంద్రబాబు ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే పేరుకు వాకాటిని పార్టీ నుండి సస్పెండ్ చేసారేగాని పార్టీ కార్యక్రమాలకు ఆయనేం దూరం కాలేదు. ఈమధ్య చంద్రబాబు జన్మభూమి సభలో కూడా పాల్గొన్నాడు. ఆయనపై వున్న సస్పెండ్‌ను త్వరలోనే ఎత్తేస్తారనుకున్న నేపథ్యంలో ఆయన మెడకు సిబిఐ ఉచ్చు బిగుసుకుంది. మరి చంద్రబాబు ఆయనను కాపాడుతాడో లేక పార్టీ నుండి దూరంగా గెంటేస్తాడో చూడాలి.

# భక్తుల సేవలో ప్రభాకరుడు

## కదిలే పైకప్పు కోసం టి.టి.డికి 1.09కోట్ల విరాళం



నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వెలసిల్లే కలియుగ దేవదేవుడు కొలువైన తిరుమల తిరుపతి క్షేత్రానికి ప్రతిరోజూ లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఏడుకొండలవాడి మీద భక్తితో ఎండను, వానను లెక్క చేయక వచ్చే భక్తుల కోసం టీటీడీ ఎన్నో ఏర్పాట్లు చేస్తుంది. భగవంతుడిని సేవించడమే కాదు, ఆ భగవంతుడి ఆరాధనలో తరించే భక్తులను సేవించుకోవడం ఓ గొప్ప పుణ్య కార్యక్రమమని భావించిన నెల్లూరీయుడు, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తిరుమల ఆలయంలో కదిలే పైకప్పు(రీట్రాక్టబుల్ రూఫ్) నిర్మాణం కోసం కోటి9లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. ఇందులో మొదటి విడతగా 22వ తేదీ తన సతీమణి శ్రీమతి ప్రశాంతితో కలిసి 55లక్షల డి.డిని టిటిడి జె.ఇ.ఓ శ్రీనివాసరాజుకు అందజేశారు.

భక్తులకు ఎండ, వానల నుండి రక్షణ కల్పించేందుకు ఈ రూఫ్ ఉపయోగపడుతుంది. వేమిరెడ్డి దానగుణాన్ని జె.ఇ.ఓ శ్రీనివాసరాజు అభినందించారు.

# జగన్ జనం!

(మొదటి పేజీ తరువాయి)



రాయలసీమ నాలుగు జిల్లాలలో ప్రజా సంకల్పయాత్ర ముగించుకొని ఈ నెల 23వ తేదీ ఉదయం పెళ్లకూరు మండలంలోని పెనబాక వద్ద జిల్లాలో అడుగు పెట్టిన జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తమ కష్టాలు తెలుసుకోవడానికి, కన్నీళ్ళు తుడవడానికి, మీకు నేనున్నాననే భరోసా కల్పించడానికి వందల కిలోమీటర్ల దూరం నడిచొచ్చిన జగన్‌ను జనం అక్కున చేర్చుకున్నారు.

జగన్‌ను చూసేందుకు పాదయాత్ర జరుగుతున్న రోడ్లపైకి జనం తండోప తండాలుగా వస్తున్నారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు జగన్ కోసం ఆగుతున్నారు. ఆయన్ను చూసాకే కదులుతున్నారు. పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు జగన్ వస్తున్నాడని తెలియగానే పనులు పక్కనపెట్టి పరుగుపరుగున వస్తున్నారు. ఆయనతో కలసి అడుగులు వేస్తున్నారు. వృద్ధులు మా మనుమడొచ్చాడంటూ, మహిళలు మా తమ్ముడొచ్చాడంటూ ఆయనను మంగళహారతులతో ఆత్మీయంగా స్వాగతిస్తున్నారు. అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని అసోసియేషన్‌ల నాయకులు పాదయాత్రలో జగన్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళుతున్నారు. మనందరికీ త్వరలో మంచిరోజులు రానున్నాయంటూ ఆయన అందరికీ భరోసా ఇస్తూ ముందుకు కదులుతున్నాడు. ఆయా గ్రామాల ప్రజలు తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళినప్పుడు ఆయన చాలాశ్రద్ధగా విని నోట్ చేసుకుంటున్నాడు. జగన్‌తో సెల్ఫీలు తీసుకోవడానికి ఉత్సాహం చూపే ఏ ఒక్కరినీ ఆయన నిరాశపరచడం లేదు. చాలా ఓపిగ్గా వారితో సెల్ఫీలు దిగాకే ముందుకు కదులుతున్నాడు.

24వ తేదీ నాయుడుపేటలో జరిగిన బహిరంగ సభకైతే జనం పోటెత్తినట్లు వచ్చారు. జిల్లాలోని వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు జగన్ అడుగుల్లో అడుగులు వేస్తూ ఆసాంతం పాదయాత్రలో వెన్నంటి ఉంటుండం విశేషం.



జగన్‌తో అడుగులు కలిపిన మేకపాటి, ఆనం విజయ



నాడు తండ్రి వై.యస్. వెంట నిలిచి... నేడు తనయుడి వెంట నడుస్తూ...
'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి



తన అభిమాన నాయకుడితో ఎమ్మెల్యే అనిల్



చిట్టి చెల్లెమ్మలతో జననేత

# వైకాపాకే విపిఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఓ వైపు వ్యాపారరంగంలో తలమునకలై వుంటూనే మరో వైపు ఈ సమాజానికి మనమేం చేయగలమనే తపనతో ఇటు సేవారంగంలోనూ అటు ఆధ్యాత్మిక రంగంలోనూ తనకు చేతనైన కార్యక్రమాలను చేస్తూ ఒక్క నెల్లూరు జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తనదైన ముద్రవేసుకున్నాడు.

కొంతమంది వ్యక్తులకు పార్టీల వల్ల మేలు జరుగుతుంది. మరికొంతమంది వ్యక్తుల వల్ల పార్టీకి మంచి జరుగుతుంది. విపిఆర్ ఈ రెండవ కోవకు చెందినవాడు. ఆయనకు



ప్రజా నాయకుడు స్వర్గీయ వై.యస్.తో ప్రజా సేవకుడు విపిఆర్(ఫైల్‌ఫోటో)

నటించడం చేతకాదు, చెడు అంటే తెలియదు, నమ్మిన సిద్ధాంతాన్ని, నమ్ముకున్న వ్యక్తులను కాపాడుకుంటూ తన పని తాను చేసుకుపోయే వ్యక్తిత్వం. తన సేవా కార్యక్రమాలకు ఒక వేదికగా రాజకీయ రంగాన్ని ఆయన ఎంచుకున్నప్పుడు ఆయనకు ముందుగా గుర్తొచ్చింది దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. వై.యస్. అంటే ఆయనకు ఇష్టం. వై.యస్. వ్యక్తిత్వమంటే ఆయనకి ఇష్టం. వై.యస్. చేసిన ప్రజోపయోగ కార్యక్రమాలంటే ఆయనకు ఇష్టం. ఆడిన మాట తప్పని వై.యస్. నిజాయితీ అంటే ఆయనకు ఇష్టం. అందుకే వై.యస్. కుమారుడికి అండగా వుండాలనుకున్నాడు, జగన్‌రెడ్డి వైపు అడుగులు వేశాడు. అయితే కొన్ని వ్యక్తిగత కారణాలు, వ్యాపార వ్యవహారాలు రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించడానికి ఆయనకి ఇబ్బంది కలిగిస్తుండడంతో ఆయన పార్టీ నుండి దూరంగా వచ్చేశాడు. రాజకీయాలకు కొద్దిరోజులు విరామం ఇద్దామనుకున్నాడు. అయితే చిక్కిందే అదనుగా తెలుగుదేశం పార్టీ ఆయనకు వలవేసింది. తమ పార్టీలోకి రావాలంటూ రాయబారాలు నడిపింది. విపిఆర్ సేవలకు తగిన గుర్తింపు వచ్చేలా ఆయనకు హోదా కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పింది. ప్రభాకర్‌రెడ్డి స్వతహాగా మెతక. వ్యాపార వ్యవహారాలలో ఆయన ఎంత గట్టిగా వుంటాడో, వ్యక్తిగత విషయాలలో అంత సున్నిత మనస్కుడు. మొహమాటం ఎక్కువ. ఇలాంటి లక్షణాలే ఆయన తెలుగుదేశంపార్టీలో చేరడానికి ఆయన చేత 'యస్' అనిపించాయి.

అయితే తానొకటి తలిస్తే విధి మరొకటి తలచింది. తాను పార్టీలోకి రావడానికి సముచితంగా వున్నానని విపిఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటి నుండి తెలుగు నేతల పోకడ మారిపోయింది. పార్టీ అధినేత సమక్షంలో పార్టీలో చేరాలని వాళ్ళే తేదీ ఖరారు చేయడం, వాళ్ళే మళ్ళీ రద్దు చేయడం. బాస్ మిమ్మల్ని రమ్మంటున్నాడని హడావుడి చేయడం, మళ్ళీ ఇప్పుడు కాదులే అని వాయిదా వేయడం. ఎప్పుడూ చెప్పిన మాటపై నిలబడకపోవడం, ఇచ్చిన అపాయింట్‌మెంట్‌ని వారికై వారే రద్దు చేయడం వంటి వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభాకర్‌రెడ్డికి ఆ పార్టీ నేతల చిత్తశుద్ధి, అంకితభావం ఏపాటిదో అర్ధమైపోయింది. వీరిదంతా ఉత్తుత్తి ప్రగల్భాలే అన్న నిర్ణయానికొచ్చేశాడు. ఇదే సమయంలో ఆయనకు మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర నుండి పిలుపొచ్చింది. మీకిచ్చిన మాటకి మేం కట్టుబడి వున్నాం. మీరు చూపిన ప్రేమ మేమెన్నటికీ మరువలేకున్నాం అంటూ వై.యస్.ఆర్ పార్టీ నేతలు ఆయన ముందు వాలిపోయారు. మార్చిలో రానున్న రాజ్యసభ ఎన్నికల్లో మా అభ్యర్థి మీరే అంటూ ఆయనకు హారతులు పడుతూ పార్టీలోకి రావలసిందిగా ఆహ్వానించారు. దివంగత మహానాయకుడు డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గారి ఆశయ సాధన కోసం స్థాపించబడి, మాట తప్పని మడమ తిప్పని ఆయన వారసుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ వేదికగా మీ సేవలు కొనసాగించాలని విపిఆర్‌ని అభ్యర్థించారు. మనిషెక్కడున్నా మనసు అక్కడే వుండడంతో వెంటనే విపిఆర్ తన ఆమోదాన్ని తెలిపాడు. పార్టీలో చేరడానికి సిద్ధమైపోయాడు.

విషయం తెలుసుకున్న తెలుగుతమ్ముళ్ళు ఆయన వెంటపడ్డారు. బ్రతిమలాడారు. అన్ని మార్గాలూ అన్వేషించారు. ఎలాగైనా వొప్పించాలని చూశారు. కానీ ఆయన మారలేదు. వై.యస్. అభిమానిగా, మాటతప్పని మంచి మనిషిగా మరోసారి తనను తాను రుజువు చేసుకున్నాడు. త్వరలో వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీలో అధికారికంగా చేరనున్నాడు. ఇది శుభపరిణామం. వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ మ్రోగించనున్న విజయభేరికి ఇది ఆరంభం. మంచితనం మానవత్వం మూర్తీభవించిన విపిఆర్ లాంటి వాళ్ళు వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డికి ఇచ్చే నిజమైన నివాళికి నిదర్శనం. వై.యస్. వారసుడిపైనా ఆయన ఇస్తున్న వాగ్దానాలపైనా, ఆయన చేస్తున్న ప్రమాణాలపైనా ప్రజలకు నాయకులకు, మేధావులకు కలుగుతున్న నమ్మకానికి విపిఆర్ లాంటి వ్యక్తులు ఆ పార్టీలో చేరడమే తార్కాణం.

నెల్లూరులో ఆరంభం కానున్న ఈ శుభఘడియలు ఇలాగే కొనసాగి రాష్ట్రమంతా వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీకి, ఆ పార్టీ అధినేత వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పలకాలని వై.యస్. అభిమానుల ఆకాంక్ష.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com